
AL-HiLaL

నెలవంక

జుమాదిఉల్ అఖ్ఖర్ హిజ్రి శకం 1434

Vol 8, Issue: 66 April - 2012 nelavankaonline.com مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



ఇస్లామీయ సంస్కృతి-శిక్షాస్కృతి

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

telgo fbrvry.indd 1 4/8/12 12:41 PM



చూపుల చౌర్యానికి దూరంగా

ఆయన చూపుల చౌర్యాన్ని (కళ్ళల్లోని మోసాన్ని),
గుండెల్లోని గుట్టును సయితం (బాగా) ఎరుగుతాడు".
(దివ్యఖుర్‌ఆన్-40: 19)

అల్లాహ్ ప్రతి వస్తువును - అది బహిర్గతమైనదైనా, గోప్యమైనదైనా, పెద్దదయినా, సూక్ష్మాతి సూక్ష్మమైనదైనా, అల్పమైనదైనా, గొప్పదైనా - గమనిస్తూ ఉన్నాడు అని తెలిసిన తర్వాత సర్వకాల సర్వావస్థల్లో నిజ భావంలో ఆయనకు భయపడాలి. కళ్ళతో కవ్వించడం, చేష్టలతో ఉడికించడం, దొంగ చూపులు చూడటం, దురాలోచనతో దృష్టి సారించడం చెడు లక్షణం. చెడు చూపు ఎన్నో ఉపద్రవాలకు కారణభూతం అవ్వ తుంది. కాబట్టి చూపుల్ని కాపు ఉంచాలి. మనసులో చెడు ఆలోచనలకు తావియ్యకుండా జాగ్రత్త పడాలి. ఆత్మను సదా నిర్మలంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి. మన ప్రతి చర్యకుగాను, ప్రతి క్రియకుగాను అల్లాహ్ సన్నిధిలో జవాబు చెప్పుకోవాల్సి ఉంటుదని గుర్తుంచుకోవాలి.

NIDAVANIKA
సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HILAL
హిజ్రీ శకం 1434
నెలవంక
(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 66
April - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw


DESIGN
Nader Belal
مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net

ఈ సంచికలో....



ఇస్లామీ సంస్కృతి - శిక్షాస్మృతి

జలం జనం మనం





కర్మభూమిలో పూసిన ఓ పువ్వా



విశ్వాస మాధుర్యం

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "మాట వరసకైనా (నవ్వించ డానికైనా) అబద్దం ఆడని వ్యక్తికి విశ్వాస మృదు మాధుర్యాన్ని ఆస్వాదించే మహా భాగ్యం ప్రాప్తమవుతుంది".

అడుగు - ముందడుగు	2
జలం జనం మనం	3
ఇస్లామీయ సంస్కృతి-శిక్షాస్మృతి	4
పారశీక-యూదు మతంలో దైవభావన	6
ముస్లిమేతరులకు మక్కాలో....	7
అనుమానాలు-మనోవాంఛలు	8
సమర్పణ-అనుసరణ	10
ఆయన నాస్తికులకూ ప్రవక్తే	11
ముస్లిం జీవితానికి సంబంధించిన...	12
ముస్లిం కాబాలయాన్ని పూజిస్తారా?	13
రుచి-అభిరుచి	14
ప్రవాసాంధ్రులకు	15
ప్రవక్త యూసుఫ్ (అ)	16
ఐపిసి వార్తలు	17
మానవ మహోపకారి ముహమ్మద్ (స)	18
కర్మభూమిలో పూసిన ఓ పువ్వా	20

تقدم حقيقي - الماء في التاريخ - التوازن الحميد بين العاطفة والعقل الرشيد - التوحيد في المجوسية و اليهودية - لماذا لا يجوز دخول غير مسلم في حدود الحرم - الحجاب جنة - الإتباع - هو رسول للملحدين أيضا - خذ عقيدتك من الكتاب والسنة - هل المسلمون يعبدون الكعبة؟ - الطبخ الكويتي - نصائح للوافدين - أخبار اللجنة - نبي الله يونس عليه السلام - الشمائل المحمدية - نشيد - رسائل الهلال

telgo fbrvry.indd 1 4/8/12 12:41 PM



అడుగు ముందడుగు

అడుగు అనే సరికి అనేక అర్థాలు స్ఫురిస్తాయి. అడిగినకొద్దీ అర్థాలు పుట్టుకొస్తాయి. అందుకే **'అడుగు తెలియని ప్రతీదాన్ని'** అంటున్నాడు ఆ పరమ ప్రభువు. తనకు ప్రాప్తమయి ఉన్న అసాధారణ తెలివి తేటలతో, అనుపమ ప్రతిభతో, అవిరళ కృషితో, అనూహ్య ఫలితాలతో అధ్భుతాల్ని, మహత్కృతాల్ని ఆవిష్కరించి తన తర్వాతి తరంకోసం **అడుగుజాడల** ముద్రని వదిలి దృశ్యంగా కను మరుగై ఆదర్శంగా సుజనులై, సుగతులై సజీవంగా సమాజంలో అగ్రజులంటూ నీరాజనాలందుకొనేవారు కొందరుంటుంటే, మరి కొంద రేమో ఆదర్శశూన్యులుగా చెలామణి అవుతూ, అలగాజనాల అడుగులకు మడుగులొత్తుతూ **'అడుగు గులాములు'**గా బ్రతుకుతూ, **అడుగు** లేని పాత్రలా తడబడు **అడుగు**లతో తంటాలు పడుతూ, మోక్షసాధన **అడుగు** దూరంలో ఉన్నా **అడుగె**త్తలేక, ఎత్తినా **ముందడుగు** వేయలేక **అడుగు** తప్పి, **అట్టడుగు**న పడి అష్ట అప్రతిష్టలకు గురై గుణపరంగా **అడుగు** పుట్టలుగా, అస్పృశ్యులుగా, **అడుగం**టిన సిద్ధాంతాలతో, తేలిపోయిన తత్వాలతో తొక్క మనుషులుగా తస్కారం పొందుతున్నారు.

కలికి (స్త్రీ) తీపి, కలిమి (సంపద) తీపి, కడుపు తీపి (సంతానం) కలగలిసి ఆడే నాటకంలో నలిగిపోతుంటాడు నరుడు, నరరూప రాక్షసునిగా మారిపోతుంటాడు ప్రవఁరుడు. ఏ **అడుగు** తన ప్రక్కను తాకినా ఎంత విషం కక్కుతాడు? ఏ చెయ్యి తన తల జట్టును తడిమినా ఎన్ని పొగలు చిమ్ముతాడు? తన చేని గట్టు కాస్త తరిగితే తలలు పుచ్చకాయల్లా పగులుతాయి. తన ఆటపట్టు కాస్త చెదిరితే అంకురించిన అనుబంధాలు ఎండుటాకుల్లా రాలుతాయి. త్యాగమెరుగని ఈ **అడుగు** ఎందాక? ఎన్నాళ్ళు సాగుతుంది మమతెరుగని ఈ నుడుగు? ఈ హింస గెలుపొతుందా? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యాలను నూరిపోసే ఈ దూకుడు మేలుకొలుపౌతుందా? మనుషుల్ని చంపితే కాదు; మనసుల్ని కలిపితే గెలుపు. చెడూ మంచీ తెలిస్తేనే కదా చెడుకు మనసు లొంగకుండా ఉండేది.

నీతి బాటన, నిజ ధర్మ రీతిన నడవాలి మన **అడుగు**. అది అవినీతి పాలిట అవ్వాలి చిచ్చర పిడుగు. అయితే ఇక్కడో అడ్డంకి గండంలా పొంచి ఉంది, **అడుగం**టని మడుగు మనసుతో. అయినవారిలానే ఎదురౌతుంది అరువు తెచ్చుకున్న చిరునవ్వులతో. కుశల ప్రశ్నలు కురిపిస్తుంది కొనితెచ్చుకున్న పన్నీటి జల్లులతో. అదమరచి **అడుగే**సామంటే ఆ నవ్వులే అడుగెత్తనీయకుండా నిలువ రిస్తాయి. పసిగట్టి మసలుకోకుంటే ఆ కుశల ప్రశ్నలే కొంపలు కూలుస్తాయి. మన కంటి మిసిమిని కబళించాలని, మన ఇంటి పరువుని పెకళించాలని, మన వంటిని మింటికి సాగనంపాలని ఇరులు (చీకట్లు) పొంచి ఉన్నాయి. ఉరులు (స్వార్థ చింతన) పన్నుతు న్నాయి. సంకల్పం పదునుదేరేదాకా, సముజ్వల గమ్యం చేరేదాకా స్తుతులకూ-కుత్సిత మతులకూ చలించక, తీతువుల అరుపులనూ – పీతల నడకలనూ గణించక **ముందడు**గెయ్యాలి జాగ్రత్తగా!

పేరాశ దిక్కులు చూస్తున్నా, అగ్రరాజ్యాలు గోళ్ళు గిల్లుకుంటున్నా, ప్రజోధ్యమాలకు బాసటగా ఉంటామని ప్రగల్భాలు పలికే ప్రబు ద్ధుల పైశాచిక శక్తుల **అడుగు**లకు మడుగులొత్తుతూ తిరుగుతున్నా, **వెనుకడుగె**య్యక ఒక **అడుగు** ముందుంటూ కరాలే (తలలే) కర వాలాలుగా, గుండెలే తుపాకీ గుండ్లుగా, కదను తొక్కుతూ, కరుణామృతాల్ని పంచుతూ, ప్రేమానురాగాల్ని పెంచుతూ, కంకాళాల (డొక్కల)లో క్రాంతి శంఖమొత్తుతూ కాంతి వేగంతో పురోగమించే మహా ప్రభంజనం అవ్వాలి మనం. హంసపాదు అలగాజనాలకు అదమాయిస్తూ నిలుచుంటే, ఎదురయ్యే గుంటనక్కలకు సముదాయిస్తూ కూర్చుంటే, కాలం ఖరాబౌతుంది. క్రాంతి కుంటుపడు తుంది. రంగులు మార్చే ఊసరవెల్లులు రంగం మీద చిందులు తొక్కినా, తడికి ఆవల తోడేళ్లు శిశిర శాస్త్రాలు వల్లించినా అదరక బెదరక **అడుగె**య్యాలి, కడిగెయ్యాలి. **అడుగు** ముందుకేసి అనంత కాలవాహినిలో మన **అడుగు**జాడలెన్నని ఆలోచించాలి. మనం వేసే ప్రతి **అడుగు** జడీభవించిన చైతన్యానికి మరో మలుపవ్వాలి. అది అడుసులో నక్కిన ముళ్ళను తొక్కేస్తూ సాగాలి.

అట్టి సాహసం మనం చెయ్యాలంటే **అడుగు** నిలకడ అవసరం. ఎందుకంటే, **అడుగు** తప్పిన మనిషిని **అడుగడుగు**నా అనేక శక్తులు లోబర్చుకోవడానికి యత్నిస్తుంటాయి. కాబట్టి నరులు చేసిన నియమాలకు లోబడి జీవించడానికి బదులు మనందరి నిజ ప్రభువు శాసనాలకు విధేయులై జీవిస్తే ఆ ఒక్క విధేయత మనల్ని ముక్కోటిన్నర విధేయతల సంకెళ్ల బారి నుండి విముక్తిని కలిగి స్తుంది. **అడిగి**తే ఆ ఆపద్బాంధవుడినే **అడగా**లి అన్న జిజ్ఞాస మనలో మొగ్గతొడుగుతుంది. అప్పుడు ఆ మార్గంలో ఆద్యులు, ఆదర్శ ప్రాయులైన ప్రవక్తల నీతి నడవడికల నుడుగుల నీడలు మన పాలిట నిత్య, నిర్మల **అడుగు**జాడలవుతాయి. అదే అసలు మానవా భ్యుదయానికి, లోకోద్ధరణకు, లోకాభ్యున్నతికి సిసలైన **అడుగులు** (మెట్లు). సమరసం, సుహృద్భావం, శాంతి, స్వర్గ సాధనకు సోపానాలు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"ఆయన వారికి సన్మార్గం చూపుతాడు. వారి పరిస్థితిని చక్కదిద్దుతాడు. వారికి (ముందుగా) తెలిపివున్న స్వర్గంలో ప్రవేశం కల్పి స్తాడు. విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు గనక అల్లాహ్‌కు సహాయం చేస్తే (ధర్మాన్ని రక్షిస్తూ, ధర్మోన్నతి కోసం పాటుపడితే) ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ అడుగులకు నిలకడను ఇస్తాడు". (దివ్యఖుర్‌ఆన్-47: 5-7)

telgo fbrvry.indd 2 4/8/12 12:41 PM

శాంతి ప్రియ

జలం జనం మనం

జలం-బలం

"ఇంకా, ప్రాణమున్న ప్రతి దానిని మేము జలం తోనే చేశాము". (దివ్యఖుర్‌ఆన్– 21: 30)

జలంతో అనే పదాన్ని వర్షపు నీరుగా, కాలువ నీరుగా భావించినట్లయితే అప్పటకీ–దాని ద్వారా ప్రతి వస్తువుకూ నవ జీవ నం లభిస్తుంది. ఒకవేళ ఈ పదాన్ని 'వీర్యబిందువు' అన్న అర్థంలో తీసుకుంటే – ప్రతి ప్రాణీ దాంతోనే ఉనికిలోకి వస్తున్నది జగమెరిగిన సత్యం.

వర్షాలకు నిండే వాగులూ వంకలూ....ఈ మూడు మనిషికి జల నిధులు. భూగోళంలో 70 శాతం నీరే. అందులో 97 శాతం ఉప్పు నీరు. మిగిలిన మూడు శాతం మంచి నీళ్ళు, అందులో సగానికిపైగా మంచు రూపంలో ఉంది. మహా అయితే, ఒకటి నుంచి ఒకటిన్నర శాతం మాత్రమే సురక్షితమైన తాగునీరు. కోటానుకోట్ల మానవాళి గొంతు తడుపుకోవడానికి ఆ కాసిన్ని నీళ్లే ఆధారం. అయితే మనిషి అవసరాలు మాత్రం నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. పారిశ్రామ రం గానికి నీరు అవసరం ఉంది. ఇక సేద్యం మాట సరేసరి. మనకున్న జల వనరుల్లో 85 శాతం వ్యవసాయానికే. ఈ సరఫరాలో ఒక్క శాతం తగ్గినా తీవ్ర స్థాయిలో ఆహార కొరత ఏర్పడుతుంది. దిగుబడి తగ్గిపోతుంది. నిత్యావసరాల ధరలు చుక్కల్ని తాకుతాయి. డ్యాములు నిండకపోతే జలవిద్యుత్ తగ్గిపోతుంది. పారిశ్రామిక ప్రగతి మంద గిస్తుంది. పరిస్థితి ఇలానే ఉంటే, 2030 నాటికి భారత దేశంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, 2030 నాటికి దేశ జనాభా రెట్టింపు అయి, పర్యావరణ రక్షణలో మనిషి కనబరుస్తు జాప్యం ఇలానే కొనసాగితే మరిన్ని కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని, నేడు చమురు నిల్వల కోసం యుద్ధాలు జగుతున్నట్లు రేపు నీటి వనరుల కోసం యుద్ధాల జరిగినా జరగవచ్చు అన్నది పరిశోధ కుల అంచనా.

జలం - జనం

జలం ప్రస్తావన బైబిల్ (న్యూ ఇంటర్నెషనల్ వెర్షన్)లో 442 సార్లు కింగ్ జెమ్స్ వెర్షన్‌లో 363 సార్లు వచ్చింది. మానవ ప్రస్థానంలో, పురోగమనంలో జల పాత్ర విషయానికి వస్తే, జల వనరుల్ని వెతు క్కుంటూ మనిషి సాగించిన ప్రయాణమే...నాగరికత. ఆ గలల వెంట నే పరుగెత్తాడు మనిషి. ఆ గలల సమీ పంలోనే నివాసాలు ఏర్పచు కున్నాడు. ఆ జల నిధుల ఆధారంగానే పంటలు పండిం చాడు, పరి శ్రమలు నడిపాడు. జల సంపద ఉంటేనే సకల సంప దలు ఉన్నట్టని గ్రహించాడు. ఇదో కోణమైతే, దైవం తనకు ప్రసాదించిన ప్రతిభాపాట వాలను ప్రక్కత్రోవ పట్టించి దైవం వట్టి బూటకం అని చెలరేగి ప్రవ ర్తించి నవారు కొందరైతే, దైవం తనకు ప్రసాదించిన నీరు,నిప్పు, నక్ష త్రము, నింగి, నేల, సూర్యుడు, చంద్రుడిని దైవాలుగా భావించి ఆలొకికానందంతో హారతులు పట్టారు ఇంకొందరు. ఆ క్రమంలో జలాన్ని దైవంగా నమ్మి కొలిచి దేశాల్లో భారత దేశంతో పాటు రోము, గ్రీకు, ఈజిప్ట మొదలగు దేశాలు కూడా ఉన్నాయి. నిమజ్జనం, పుష్కరాలు, గంగా స్నానాలు వంటివి భారత దేశంలో సర్వ సాధారణంగా కనబడతాయి.అలాగే కొన్ని బావులను, కోనేరులు ను పవిత్రంగా భావించిన సందర్భాలూ ఉన్నాయి. ఇదే క్రమంలో నీటి దేవతలు అన్న ఆచారమూ దర్శనమిస్తుంది. జలం క్రైస్తవుల వద్ద బాప్టిస్మం రూపంలో పవిత్ర మయితే, సిక్కుల వద్ద అమ్రిత్‌గా పవిత్ర స్థానాన్ని పొంది ఉంది. అలా జలాన్ని దైవం నమ్మిన గ్రీకులు ప్రతి వస్తువూ జలంతోనే అన్నారంటే ఆదేదో నవీన శాస్త్ర ఫలితాల కను గుణంగా ఉందనుకోవడం తప్పులో కాలేసినట్టే అవుతుంది. వారి ఉద్దే శ్యం జలమే ప్రతి ప్రాణి సృజనకు మూలకారణం అన్నది. ఎందు కంటే అది దైవం గనక. పోతే దీనకి భిన్నంగా ఇస్లాం చెప్పేదేమిటం టే సర్వలోక పరపాలకుడు, సంరక్షకుడు అయిన అల్లాహ్ ప్రతి ప్రాణి ని జలంతోనే చేశాడన్నది. జలం కుడా దైవ ఇతర వరాను గ్రాహాల్లోని ఒక భాగం అన్నది. కనుకనే సృష్టికర్తను వదలి సృష్టితాలను కొలిచే వారినుద్దేశించి ఖుర్‌ఆన్ ఇలా ప్రశ్నిస్తుంది:

"మీరేమనుకుంటున్నారు, మీరు వదిలే రేతస్సును గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఏమిటి, దాంతో (మనిషిని) సృష్టించింది మీరా? లేక మేము సృష్టిస్తున్నామా?.....పోనీ, మీరు త్రాగే మంచి నీరు గురించి ఎన్న డయినా ఆలోచించారా? దాన్ని మేఘాల నుండి మీరు కురిపిస్తు న్నారా? లేక దానిని కురిపించేది మేమా? మేము గనక తలుచుకుంటే దానిని చేదు నీరుగా మార్చేయగలం. మరలాంటప్పుడు మీరు కృతజ్ఞ లుగా ఎందుకు మసలుకోరు?". (అల్ వాఖిఅహ్: 58–70)

"వారిని ఇలా అడుగు: చూడండి, మీరు త్రాగే ఈ నీరు గనక భూమిలో ఇంకిపోతే మీ కొరకు నీటి ఊటను బయటికి తెచ్చేదెవరో చెప్పండి". (అల్‌ముల్క్: 30)

జలం - మనం

జలం మన పాలిట దేవుని మహదానుగ్రహం. అయితే ఎవరయితే నిజ దైవాన్ని వదలి ఇష్టాదైవాలను కొలుస్తారో వారి పాలిట అదే జలం శాపంగా పరిణమిస్తుంది. కాబట్టి మనం నీరును, నిప్పును, గాలిని, సూర్యుడ్ని, చంద్రున్ని కాదు ఆరాధించాల్సింది, వాటిని మనకు అనుగ్రహించిన అల్లాహ్‌ను ఆరాధిం చాలి. ఆయనకే మన సకల విధమైనటువంటి ఉపాసనారీతులను ప్రత్యేకించాలి.

జనం బతకడానికి జలం కావాలి. జనం బతుకు సాఫీగా సాగాలంటే జలం కావాలి. మన శరీరంలో 70 శాతం దాకా జలమే. ఆహారం లేకుండా ఐదు పదులు బతకొచ్చుగానీ, జలం లేకుండా ఐదు రోజులు కూడా ఉండలేము. ఒంట్లో తగిన నీరు లేకపోవడం ప్రాణానికే ప్రమాదం. మూత్ర పిండాలు మన శరీరంలో వ్యర్థాల్ని జలం ద్వారానే బయటికి పంపుతాయి. జలం తగు మోతాదులో లేక పోతే చర్మం పొడి బారిపోతుంది. కండరాల్లో కదలిక సమస్యలొ స్తాయి. ఊపిరి తిత్తులు గుండె సక్ర మంగా పని చెయ్యవు. అందుకే రోజుకు కనీసం రెండు లీటర్ల జలమయినా త్రాగాలంటారు డాక్టర్లు. వేసవిలో ఆ మోతాదు మరింత పెరగాలి. గొంతు తడుపుకోవడానికి, దప్పిక తీర్చుకోవ డానికో మాత్రమే కాదు, పరిపూర్ణ ఆరోగ్యం కోసం త్రాగాలి. కావాల్సిన జలం దేహానికి అందకపోయినా సమస్యే. కడుపు లో నికి వెళ్ళిన జలం బయటికి రాకపోయినా సమస్యే. కనుకే **'మూత్ర విసర్జన సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు దాన్ని ఆపుకొని నమాజు చేయకూడద'** న్నారు ప్రవక్త మహనీయ ముహమ్మద్ (స).

మనందరి కోసం అల్లాహ్ రెండు హైడ్రోజన్ అణువులూ, ఒక ఆక్సీజన్ అణువూ కలిసి ఒక్కటై చల్లని నీటి చుక్కగా మారే ఏర్పాటు చేసి గొప్ప మేలు చేశాడు అందుకు కృతజ్ఞతగామనం నీటిని కొరత నుండి, పర్యావరణాన్ని కాలుష్యం నుండి, విద్యుత్‌ను కోత నుండి, నిత్యావసర వస్తువులను ధరల మోత నుండి, పరివారాన్ని నరక రోత నుండి కాపాడుకుందాం! సృష్టిని కాదు సృష్టికర్త అయిన అల్లాహ్‌ను ఆరాధిద్దాం!!






telgo fbrvry.indd 3 4/8/12 12:42 PM

ఇస్లామీయ సంస్కృతి - శిక్షాస్మృతి

ఈ ప్రపంచం అనేక సంస్కృతుల-శిక్షాస్మృతుల, కూడలి. ఒక ప్రాంతపు సంస్కృతికి-శిక్షాస్మృతికి మరో ప్రాంతం ప్రభావితం కావడం సహజంగా జరిగే విషయం. ఆది మానవుడైన ఆదం (అ) గారి కాలం నాటి నుండి మొదలయిన ఈ నాగరికతా ప్రస్థానంలో అనూహ్యమైన అలంకారాలను, మార్పులను సంతరించుకుంది సంస్కృతి-శిక్షాస్మృతి. దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వారి రాకతో పరిపూర్ణతను సంతరించుకున్న సంస్కృతి-శిక్షాస్మృతులు తన స్పష్టమైన ఆకృతి ప్రభావాన్ని ప్రపంచం మొత్తం మీద వేశాయి.

సంస్కృతి-శిక్షాస్మృతి ప్రభావంపైన, సంస్కృతి-శిక్షాస్మృతి ప్రస్థానంపైన, సంస్కృతి-శిక్షాస్మృతి ప్రామాణికతపైన, సంస్కృతి-శిక్షాస్మృతి మూలాలపైన అనేక పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. పుస్తకాల రూపంలో మనకు అందుతూనే ఉన్నాయి. మనం నిత్య జీవితంలో అలవోకగా ఆచరించే ఎన్నో అలవాట్లను, ఆచారాలను, తీర్పులను తర్కించి వాటి పుట్టపూర్వోత్తరాల గురించి, అన్య సంస్కృతుల-శిక్షాస్మృతుల నుంచి అవి నడిచి వచ్చిన వైనాన్ని విపులీకరించిన అనేకుల నోట మేలిమి సంస్కృతి-శిక్షాస్మృతి గా ప్రశంస పత్రాన్ని తన సొంతం చేసుకుంది ఇస్లామీయ సంస్కృతి-శిక్షాస్మృతి. అదెలా సాధ్యమయ్యింది? అంటే ఈ వ్యాసం చదవాల్సిందే.



మనిషి - అతను ఏ ప్రాంతానికి చెందిన వాడైనా, ఏ మతధర్మాన్ని అవలంబించే వాడైనా అతను జీవించేది మాత్రం రెండు విధమైనటువంటి లోకాలలో. ఒకటి బాహ్య ప్రపంచం. రెండవది భావ ప్రపంచం. కనుక ఈ పుడమిపై పాదం మోపిన ప్రతి మనిషికి సంబంధించిన ఈ ద్విలోకాల అవసరాలు తీరనంతవరకు అతని జీవితం ప్రశాంతమయం కాజాలదు. బాహ్య ప్రపంచంలో మనిషి మేధకు అగ్రతాంబులం ఉంటే, భావ ప్రపంచంలో మనసుది అగ్ర భాగం. ఒక్కమాటలో చెప్పాలంటే న్యాయం -త్యాగం అన్న గుణాలు ప్రతి సమాజపు మనుగడకు పునాదిరాళ్ళు. ఈ విషయమై ప్రపంచ చరిత్రను, ప్రపంచంలోని శిక్షాస్మృతులను పరిశీలించినట్లయితే, మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఆవిర్భావానికి పూర్వం వరకు ఉన్న పరిస్థితివేరు. ఆయన ప్రభవనం తర్వాతి స్థితి వేరు అన్న విషయం ఇట్టే అర్థమవుతుంది.

నేడు ఒక వర్గం శిక్షాస్మృతుల విషయంలో ఓ అతివాదానికి గురై ఉంటే, మరో వర్గం మన్నింపు విషయంలో ఇంకో అతివాదానికి గురై ఉంది. అది శిక్షాస్మృతిలోని మరణ దండనకు వ్యతిరేకంగా ఎంత ఉధృతంగా ప్రచారం చేసిందంటే చాలా మంది మరణ దండనను అసహ్యకరమయిందిగా భావిస్తున్నారు. ప్రపంచంలో అనేక దేశాలు దాన్ని పూర్తిగా రద్దు చేశాయి కూడా. నిజంగా హత్యా ప్రతీకార చట్టంలో సమాజ జీవితం దాగి ఉందీ, ఏ సమాజమయితే మానవ జీవితాన్ని గౌరవించని వారి ప్రాణాలను ఆదరణీయంగా బావిస్తుందో అది వాస్తవానికి చంకలో విష సర్పాన్ని, తన మధ్య కనికరం ఎరుగని క్రూర మృగాన్ని పెంచి పోషిస్తున్నదన్న మాట. ఆ సమాజం ఒక హంతకుని ప్రాణాన్ని కాపాడి అనేక అమాయక ప్రజల ప్రాణాలను ప్రమాదానికి గురి చేస్తున్నదన్న మాట అంటూ ఖుర్‌ఆన్ బుద్ధి జీవులను సంబోధించి హెచ్చరిస్తుంది.

"ఓ విశ్వసించిన జనులారా! హత్యా వాజ్యాలలో మీకు 'ఖిసాస్' విధానం విధించబడింది. హంతకుడు స్వతంత్రుడయితే ఆ స్వతంత్రుడిపైనే ప్రతీకారం తీర్చుకోవాలి; బానిస హంతకుడయితే ఆ బానిసకే మరణ శిక్ష విధించాలి; స్త్రీ నేరం చేస్తే ఆ స్త్రీనే శిక్షించాలి, అయితే హంతకుని పట్ల అతని సోదరుడు మన్నింపుల వైఖరి అవలంబించడానికి సిద్ధ పడితే ప్రసిద్ధ రీతిలో హత్యా పరిహారం నిర్ణయం అవ్వాలి. హంతకుడు నిజాయితీగా దాన్ని చెల్లించడం ధర్మం. ఇది మీ ప్రభువు చూపుతున్న రాయితి, కనికరం. ఇక దీని మీద కూడా ఎవరయినా మితిమీరి ప్రవర్తిస్తే అతనికి బాధాకరమయిన శిక్ష పడుతుంది. బుద్ధీ వివేకాలు గల జనులారా! ప్రతీకార చట్టంలోనే మీకు సముజ్జీవనం లభిస్తుంది. మీరు ఈ శాసన ఉల్లంఘనకు పాల్పడకుండా మెలుగుతారని భావించ బడుతోంది".

(అల్ బఖర: 178,179)

telgo fbrvry.indd 4 4/8/12 12:42 PM

అల్లాహ్ ఈ ఆయతులో హత్యా ప్రతీకారం తీర్చుకునే (మేలిమి మేధ అప్పీలును) హక్కును ఇవ్వడంతోపాటు మనసు సంబంధిత సదాచరణను సయితం ఎరుక పర్చాడు. అంటే మనకు ఎదుటి వ్యక్తికి మధ్య పితృ సంహార వైరం ఉన్నప్పటికీ అతనయితే మన తోటి మానవ సోదరుడే కదా. అందువల్ల తప్పు చేసిన ఓ సోదరుని విషయంలో ప్రతీకారాగ్రహాన్ని మింగేశామంటే అది మనలోని మానవతను ఇతోధికంగా ప్రతిబింబించే ఘనమయిన విషయం. ఈ ఆయతులో తెలుపబడిన మరో విషయం ఏమిటంటే, ఇస్లామీయ శిక్షాస్మృతిలో హత్యలాంటి వ్యవహారంలో కూడా రాజీకి ఆస్కారం ఉంది. హతుని వారసులకు హంతకుణ్ణి క్షమించి వేసే హక్కు ఉంది. ఇలాంటి సందర్భంలో న్యాయస్థానం, హంతకునికి మరణ శిక్ష విధించవలసిందే నని పట్టుబటడం ధర్మసమ్మతం కాదు,. అయితే హంతకుడు వారు కోరిన హత్యా పరిహారాన్ని విధిగా చెల్లించాల్సి ఉంటుంది. హత్యా పరిహారం ఇస్తానని ఎగొట్టడమూ దుర్మార్గమే, పరిహారం తీసుకుని కూడా మళ్ళి వ్యక్తిని హతమార్చడమూ దౌర్జన్యమే అంటుంది.

ఈ విషయమై అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"నిశ్చయంగా అల్లాహ్ న్యాయ బద్ధతను, అనుగ్రహశీలతను, బంధుత్వ అనురాగాన్నీ (పాటించాలని) ఆదేశిస్తున్నాడు. ఇంకా – నీతిబాహ్యమైన పనుల నుండీ, చెడుల నుండీ, దౌర్జన్యం నుండీ ఆయన ఆపుతున్నాడు. మీరు గుణపాఠం గ్రహించడానికి ఆయన స్వయంగా మీకు ఉపదేశినున్నాడు".** (అన్ నహ్ల్: 90)

ఈ ఆయతులో **'అద్ల్'** అన్న పదం ఉంది. దీని భావనలో రెండు స్థిర యదార్థాలు మిశ్రమమయి ఉన్నాయి. ఒకటి జనుల మధ్య హక్కుల్లో సమతుల్యత, సానుకూల ఔచిత్యం స్థాపించబడాలి. రెండు ప్రతి వ్యక్తికి అతని హక్కు నిష్కర్షగా అందజేయాలి.

న్యాయం అనగానే సాధారణంగా ఇద్దరి మధ్య హక్కుల విభజన చెరి సగం జరగాలన్న భావన తప్పుడుగా ఏర్పడింది. దాని ప్రకారమే ఒక విషయంలో న్యాయం అనగానే సమాన స్థాయి విభజన జరుగుతుందన్న భావన ఏర్పడింది. ఇది మానవ మేధకు, నైజానికి, న్యాయానికి విరుద్ధమైన విషయం. ఎక్కువ, తక్కువ సేవ చేసేవారం దరికి సమాన స్థాయిలో వెతనం లభించాల నడం ఎంత మాత్రం సమంజసమైన విషయం కాదు. ఈ విధమైనటువంటి సమానత్వం, సమతా భావాన్ని ఇస్లాం కొన్ని సందర్భాలకే పరిమితం చేస్తుంది. ముఖ్యంగా భావోద్రేకానికి లోనై చేసే తీర్పు విషయంలో.ఉదాహరణకు నోమాన్ బిన్ బషీర్ (ర) తెలియజేసిన ఈ సంఘటన ఓ మచ్చుతునక. 'మా నాన్న గారు నాకో కానుక ఇచ్చారు. అది చూసిన మా అమ్మగారు, ఈ కానుకకు దైవ ప్రవక్త (స) సాక్షిగా ఉండనంత వరకూ తాను దాన్ని ఒప్పుకోనని అంది. అప్పుడు మా న్నా దైవ ప్రవక్త (స) వద్దకు వెళ్ళి విషయాన్ని వివరించారు. అందుకు ప్రవక్త (స) **'నీవు నీ పిల్లలందరికీ ఈ కానుకను ఇచ్చావా?'** అని దర్యాప్తు చేశారు. 'లేద'ని మా నాన్న గారు బదులిచ్చారు. **'మరయితే అల్లాహ్‌కు భయపడు. సంతానం మధ్య న్యాయాన్ని పాటించు. నేను అన్నాయానికి సాక్షిగా ఉండను'** అని చెప్పారు. (సహీహ్ బుఖారీ, ముస్లిం)

ఎందుకంటే, న్యాయం ద్వారా సమాజంలో శాంతి సుస్థిరతలు నెలకొంటే, త్యాగ భావం ద్వారా అంతరంగాల అగాధాలు పూడుకుంటాయి. హృదయాలు హత్తుకుంటాయి. సత్సంబంధాలు పెంపొందుతాయి. ప్రేమానురాగాలు విరబూస్తాయి. ఆత్మీయత ఆప్యాయతలు వెల్లివిరుస్తాయి. ప్రవక్త (స) వారినుద్దేశించి అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సంబోధించాడు:

"(ప్రవక్తా!) ఇది ఎన లేని దైవ కారుణ్యం, నీవు వీరి కొరకు ఎంతో మృదుస్వభావిగా అలరారావు. అలా కాక ఒకవేళ నీవు తీవ్ర స్వభావివి, పాషాణ హృదయుడివి అయి ఉంటే వీరంతా నీ దరిదాపుల నుండి దూరమయి పొయ్యేవారు. వీరి తప్పుల్ని మన్నించు. వీరి కొరకు క్షమాభిక్ష వేడుకో.."

(ఆలి ఇమ్రాన్: 159)

నిజంగా హత్యా ప్రతీకార చట్టంలో సమాజ జీవితం దాగి ఉందీ, ఏ సమాజమయితే మానవ జీవితాన్ని గౌరవించని వారి ప్రాణాలను ఆదరణీయంగా బావిస్తుందో అది వాస్తవానికి చంకలో విష సర్పాన్ని, తన మధ్య కనికరం ఎరుగని క్రూర మృగాన్ని పెంచి పోషిస్తున్నదన్న మాట. ఆ సమాజం ఒక హంతకుని ప్రాణాన్ని కాపాడి అనేక అమాయక ప్రజల ప్రాణాలను ప్రమాదానికి గురి చేస్తున్నదన్న మాట అంటూ ఖుర్ఆన్ బుద్ధి జీవుల ను సంబోధించి హెచ్చరిస్తుంది.

మేలిమి మేధ కోరే న్యాయాన్ని అమలు పర్చే అధికారాన్ని అల్లాహ్ ప్రసాదిస్తూనే మృదువుగా మెలగడం మరింత మంచిదన్నాడు: **"ఒకవేళ మీరు ప్రతీకారం తీర్చుకోదలచినా, మీకు ఏ మేరకు బాధ పెట్టడం జరిగిందో ఆ మేరకే ప్రతీకారం తీర్చుకోండి. ఒకవేళ మీరు ఓర్చుకున్నట్లయితే, ఓర్పు వహించేవారి పాలిట ఇది ఎంతో శ్రేయస్కరమైనది".**

(అన్నహ్ల్: 126)

"అపకారానికి బదులు అటువంటి అపకారమే. కానీ ఎవరయినా (ప్రత్యర్థిని) క్షమించి, సయోధ్యకు వస్తే అతనికి పుణ్యఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది..."

(అష్షూరా: 40)

"మేము తౌరాతు గ్రంథంలో వారి (యూదుల) కోసం ఒక శిక్షాస్మృతిని సూచించాము. (దీని ప్రకారం) ప్రాణానికి బదులు ప్రాణం, కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పంటికి బదులు పన్ను. అలాగే కొన్ని ప్రత్యేక గాయాల కోసం కూడా (సరిసమానంగా) ప్రతీకారం ఉంది. మరి ఎవరయినా సదఖా (దానం)గా క్షమాభిక్ష పెడితే అది అతని పాలిట 'కప్ఫారా' (పాపపరిహారం) అవుతుంది".

(అల్ మాయిదా: 45)

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"ఒకరి శరీరాన్ని ఎవరైనా గాయపర్చడం జరిగి అతను దాన్ని మన్నించి వేస్తే అతను చూపిన ఈ క్షమకు సమాన స్థాయిలో అతని పాపాలను క్షమించి వెయ్యడం జరుగుతుంది".**

(ఇంకా ఉంది)

telgo fbrvry.indd 5 4/8/12 12:42 PM

మూలం
జాకిర్ నాయక్

జొరాస్ట్రియన్ (పారశీక) మతంలో దైవభావన

జొరాస్ట్రియన్ మతం ఒక ప్రాచీన ఆర్యమతం. ఇది క్రీ.పూ. 2500 సంవత్సరాలకు పూర్వం ఫారస్ (ఈరాన్)లో ఉద్భవించింది. దీని అనుయాయుల సంఖ్య చాల తక్కువగా ఉంది. అంటే మొత్తం ప్రపంచంలో ఒక లక్షా ముప్ఫై వేలకు కూడా తక్కువగానే ఉంది. అయితే ప్రపంచ ప్రాచీన ధర్మాల్లో ఇది ఒకటిగా పరిగణింప బడుతుంది. ఈరాన్‌కు చెందిన **'జర్‌తష్ట్'** (జొరాస్టర్)అనే వ్యక్తి దీన్ని ప్రారంభించాడు. అందుకే దీన్ని జొరాస్ట్రియన్ మతం అని, పారశీక ధర్మం అని కూడా పిలుస్తారు. **'దసాతీర్'** మరియు **'ఆవెస్తా'** పారశీకుల పవిత్ర మత గ్రంథాలు.

పారశీక ధర్మంలో దేవుని కోసం **'అహూర్ ముజ్‌దా'** అనే పదం వాడబడింది.**'అహూర్'** అంటే యజమాని, ప్రభువు. **'ముజ్‌దా'** అంటే **'వివేకవంతుడు'** అనే అర్థం వస్తుంది. ఈ విధంగా **'అహూర్ ముజ్‌దా'**కు అర్థం వివేకవంతుడైన యజమాని లేక ప్రభువు. **'అహూర్ ముజ్‌దా'**గా పిలువబడే భావనలో కూడా **'దేవుని ఏకత్వ భావన'** ప్రబలంగా ఉన్నట్లు కనిపిస్తుంది.

దసాతీర్‌లో దైవగుణాలు

దసాతీర్‌లో ఈ క్రింద పేర్కొన్న దైవగుణాలు వర్ణించబడ్డాయి.

1) ఆయన ఒక్కడే.
2) ఆయనకు సరిసమానుడు వేరెవ్వరూ లేరు.
3) ఆయనకు ఆరంభమూ లేదు, అంతమూ లేదు.
4) ఆయనకు ఎవరూ తండ్రిలేడు, ఆయనకెవరూ కుమారుడు లేడు, ఆయనకు భార్యాలేదు, సంతానమూ లేదు.
5) ఆయన శరీర రహితుడు,నిరాకారుడు.
6) కళ్ళు ఆయన్ని చూడలేవు, మేధా మస్తిష్కాలతో ఆయన్ని ఊహించనలవికాదు.
7) ఆయన గురించి మనం ఆలోచించే దానికన్నా,అత్యంత అధికుడాయన.
8) మనకంటే కూడా ఆయన మనకు సమీపంలో ఉన్నాడు.

ఆవెస్తాను అనుసరించి దైవగుణాలు

ఆవెస్తా, గాథా మరియు యస్‌నాకు అనుసరించి దైవానికి ఎన్నో గుణాలున్నాయి. అందులో కొన్ని ఇవి:

1) **ఖాలిఖ్** (సృష్టికర్త) – యస్‌నా31–7 మరియు 11) (యస్‌నా–44–7) (యస్‌నా 50–11) యస్‌నా 51–7)
2) **అత్యంత శక్తిశాలి, మహోన్నతుడు.** (యస్‌నా33–11) (యస్‌నా45–6)
3) **దాత–'హుదాయి'** ప్రసాదించేవాడు. (యస్‌నా33–11) (యస్‌నా48–3)
4) సఖి–స్పెంటా (దాత, దయాళువు) (యస్‌నా. 34–4,5,7,9, 11,13,15) (యస్‌నా 44–2) యస్‌నా 45–5) (యస్‌నా 46–9) (యస్‌నా 48–3)



యూదు మతంలో దైవభావన

సామి ధర్మాల్లో యూదమతం ఒక ప్రముఖమైన ధర్మం. దాని అనుయాయుల్ని "యూదులు" అని పిలుస్తారు. వారు హజ్రత్ మూసా(అలైహి) దైవప్రవక్త ప్రతిపాదించిన మిషన్‌పై విశ్వాసం కలిగి ఉంటారు.

1) ఈ క్రింది వాక్యాలు, పాత నిబంధన (డెటర్‌నొమి) పుస్తకంలో నమోదు కాబడి ఉన్నాయి. అందులో మహనీయ మూసా(అ) ప్రవక్త హితబోధ చేస్తూ ఇలా అంటారు: హీబ్రూ ఆయత్ అనువాదం ఇలా ఉంది.

'ఇస్రాయేలూ వినుము. మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా'. (ద్వితీయోపదేశ కాండము6–4)

2) ఆ గ్రంథంలోనే 'యెషయా' అనే పవుస్తకంలో ఇలా వచ్చింది: **నేను నేనే యెహోవాను నేను తప్ప వేరొక రక్షకుడు లేడు.'** (43–11)

3) **'దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు. నేను దేవుడను నన్ను పోలినవాడెవడును లేడు'.** (యెషయా: 46–9)

యూద ధర్మంలో విగ్రహారాధనను వ్యతిరేకిస్తూ ఇలా వచ్చింది. **'నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పై ఆకాశ మందేగాని క్రింది భూమియందేగాని భూమి క్రింది నీళ్ళయందే గాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు. వాటికి సాగిల పడకూడదు. వాటిని పూజింప కూడదు'.** (నిర్గమకాండము– 20: 3, 5)

4) **"నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు. పైనున్న ఆకాశ మందేగాని, క్రిందనున్న భూమియందేగానీ, భూమి క్రిందనున్న నీళ్ళయందేగాని, యుండు దేని పోలికనైన విగ్రహమును చేసికొనకూడదు. వాటికి నమస్కరింపకూడదు. వాటిని పూజింప కూడదు. నీ దేవుడైన యెహోవాయగు నేను రోషము గల దేవు డను".** (ద్వితీయోపదేశ కాండము– 5:7–9

telgo fbrvry.indd 6 4/8/12 12:42 PM



ముస్లింలు 'కాబా' లయాన్ని పూజిస్తారా?

అనువాదం
అబుల్ ఫౌజాన్

జవాబు: కాబా అనేది ముస్లింల కోసం ఒక కేంద్రం లాంటిది. అంటే వారు ప్రపంచంలో ఎక్కడున్నాసరే, నమాజ్ సమయంలో తమ ముఖాల్ని 'కాబా' వైపునకు మరల్చుకుంటారు. నమాజ్ సమయాల్లో ముస్లింలు కాబా వైపునకు ముఖాలు త్రిప్పుకునేది వాస్తవమే కాని అది దాని పూజ కోసం కాదనే విషయాన్ని మరిచిపోరాదు. ముస్లింలు అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ పూజించరు, వేరెవరి ముందు శిరస్సు వంచరు.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా చెప్పటం జరిగింది:

"ప్రవక్తా! నీవు మాటిమాటికీ నీ ముఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకు ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్‌జిదె హరామ్' వైపునకు త్రిప్పు. ఇకపై మీరెక్కడున్నాసరే, ముఖాన్ని ఆ వైపునకు పెట్టి నమాజ్ చెయ్యండి." (అల్ బఖర: 144)

1. ఇస్లాం ఐక్యతను కాంక్షిస్తుంది

ఉదాహరణకు ముస్లింలు నమాజ్ చేయ దలచినప్పుడు, కొందరు తమ ముఖాల్ని ఉత్తరం వైపునకు, మరికొందరు దక్షిణం వైపునకు తిప్పుకునే అవకాశం ఎంతైనా ఉండేది. ఒకే నిజ ప్రభువును ఆరాధించే టప్పుడు, సర్వ ముస్లింలను సుసంఘటితం చేసేందుకుగాను, ప్రపంచంలో వారెక్కడున్నాసరే, తమ ముఖాల్ని ఒకే దిశలో, ఒకే వైపునకు అంటే **'కాబా'** వైపునకు తిప్పుకోవాలని వారిని ఆదేశించటం జరిగింది. అంటే కొంతమంది ముస్లింలు కాబాకు పశ్చిమం లో నివసిస్తున్నారను కోండి, అటువంటి వారు నమాజ్ సమయంలో తమ ముఖాల్ని తూర్పు వైపునకు, 'కాబా'కు తూర్పుదిశ లో నివసిస్తున్న వారు పశ్చిమం వైపునకు తమ ముఖాల్ని తిప్పుకోవాల్సి ఉంటుంది.

2. 'కాబా' ప్రపంచ పటంలో కేంద్ర బిందువుగా ఉంది

ప్రపంచ పటాన్ని మొట్టమొదటిసారిగా ముస్లింలే రూపొందించారు. వారు రూపొందించిన ఈ భౌగోళిక పటంలో, దక్షిణం పైభాగంలోను, ఉత్తరం క్రింది భాగం లోను ఉండి, 'కాబా' మధ్యలో ఉండేది అయితే ఆ తరువాత కాలంలో ఎప్పుడైతే పాశ్చాత్యులు భూగోళ పటాన్ని రూపొందించారో, వారు ఈ దిశల్ని తారుమారు చేశారు. అంటే ఉత్తరాన్ని పైభాగంలోను, దక్షిణాన్ని క్రింది భాగం లోను చూపించ సాగారు. అయినప్పటికీ, దైవానుగ్రహం వల్ల, 'కాబా' నేటికీ భూమి మధ్య కేంద్రం లోనే ఉంది.

3. కాబా ప్రదక్షిణం(తవాఫ్)దేవుని ఏకత్వానికి ప్రతీక

ముస్లింలు మక్కా నగరానికి వెళ్ళినప్పుడు, అక్కడున్నటువంటి మస్జిద్-యె- హరాంను సందర్శిస్తారు. మరియు 'కాబా' (దైవ గృహానికి)కు ప్రదక్షిణం చేస్తారు. వారి ఈ చర్య ఏకేశ్వరునిపై విశ్వాసం మరియు ఆయనొక్కణ్ణే ఆరాధిస్తున్నారనే దానికి ప్రతీక. ఏవిధంగానైతే ఒక గుండ్రని పరిధికి కేవలం ఒకే కేంద్రబిందువు ఉంటుందో, అదేవిధంగా సకల ఆరాధనలకు, పూజా పునస్కారాలకు ఆ ఒక్క నిజ స్వామి, మాత్రమే అర్హుడు.

4. హజ్రత్ ఉమర్(ర) వాంగ్మూలము


కాబాలయంలో అమర్చబడిన హజ్‌రె అస్వద్ (నల్లటి రాయి)ను సంబోధిస్తూ, రెండవ ఇస్లామీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్(ర) చెప్పిన మాటల్ని, ప్రఖ్యాత హదీసు గ్రంథమైన సహీ బుఖారి, రెండవ సంపుటం, అధ్యాయం -హజ్, భాగము 56, హదీసు నెంబరు 675లో ఇలా ఉల్లేఖించటం జరిగింది.

'నీవు(హజ్‌రె అస్వద్) ఒక రాయివనే విషయం నాకు తెలుసు. నీవు ఎవరికీ లాభం చేకూర్చలేవు, నష్టమూ కలిగించలేవు. దైవప్రవక్త(స) నిన్ను ముట్టుకోవటం (చుంబించటం) నేను చూసి ఉండకపోతే, నేనెన్నడూ నిన్ను ముట్టుకొని (చుంబించి) ఉండకపోయేవాణ్ణి."

5.ప్రజలు 'కాబా' ఎక్కి అజాన్ పిలుపునిచ్చారు

మహాప్రవక్త ముహమ్మద్(స) జీవిత కాలంలోనైతే, ప్రజలు 'కాబా' ఆలయం కప్పుపైకెక్కి నమాజ్ కోసం అజాన్ పిలుపు ఇచ్చేవారు. ముస్లింలు 'కాబా'ను పూజిస్తారని నిందించేవారిని, విగ్రహారాధకులు ఎప్పుడైనా తాము ఆరాధించే విగ్రహం (మూర్తి)పై ఎక్కి నిలబడతారేమో, అడగాల్సి ఉంటుంది.

telgo fbrvry.indd 7 4/8/12 12:42 PM



అనుమానాలు - మనోవాంఛలు

అబ్దుల్ హమీద్ బిలాలీ

పైతాన్ రెండు ప్రధాన మార్గాల ద్వారా మనిషిలోకి ప్రవేశిస్తాడు. ఆ రెండు మార్గాల్లో ఒకటి: అనుమానాలు. రెండోది: మనోవాంఛలు. సాధారణంగా ఈ రెండు విషయాలే మనిషిని తన ప్రభువు పట్ల అవిధేయతకు పాల్పడమని పురికొల్పుతూ ఉంటాయి. దైవ ప్రసన్నతను బడసేందుకు దోహదపడే పనుల నుండి ఆపుతాయి. అనుమానాలు మనోవాంఛలు మనిషిని స్వర్గం నుండి దూరం చేసి నరకాగ్నికి ఇంధనం అయ్యేలా చేస్తాయి. ఇక్కడ మేము మనుషుల్లో జనించే కొన్ని ముఖ్యమైన సంశయాలను, అనుమానాలను గురించి పేర్కొంటున్నాం.

1. లైంగిక శక్తిపై అదుపు

ప్రజల్లో చాలామంది ఈ విధంగా ఆలోచిస్తారు. "దేవుడు మానవుల్ని (స్త్రీ,పురుష) జంటగా సృష్టించాడు. వారిలో ఒండొకరి పట్ల లైంగిక ఆకర్షణ సృజించాడు. ఇది అమిత ప్రభావవంతమైన, అత్యంత ప్రమాదకరమైన శక్తి. దానిని ఎంతగా అణచుకోవాలని ప్రయత్నిస్తే అది అంతగా పైకి ఉబికి వస్తుంది. దాన్ని మరీ ఎక్కువగా అదుపులో ఉంచటానికి ప్రయత్నిస్తే కొన్ని కొన్ని సందర్భాల్లో అది కట్టలు తెంచుకునే ప్రమాదం కూడా ఉంటుంది. ఎందుకంటే స్త్రీలు కప్పుకునే వస్త్రాలు వారి సౌందర్యాన్ని మరుగపరచి ఉంచుతాయి. అలాంటప్పుడు యువకులు తమ కోర్కెల్ని అదుపులో ఉంచుకోవాల్సి వస్తుంది.

ఆ విధంగా గనక లైంగిక కోర్కెల్ని అదుపులో ఉంచుకోవటానికి ప్రయత్నిస్తే అవి విజృంభిస్తాయి. ఆ విజృంభణే కొన్ని కొన్ని సార్లు కిడ్నాపింగ్ (అపహరణ), రేపింగ్ (బలాత్కారం) లాంటి రూపాల్లో అవతరిస్తుంది. కనుక సమస్యలన్నిటికి పరిష్కారం ఒక్కటే! అదేమిటంటే స్త్రీలను 'ముసుగు'ల్లో నుంచి బయటికి తీయాలి. అలా చేస్తే యువకులకు లైంగిక కోర్కెల్ని అదుపు చేసుకోవాల్సినఅవసరం ఉండదు. స్త్రీల ఒంపుసొంపుల్ని చూసుకొని వారు కాస్తయినా ఊరటను పొందుతారు. ఆ విధంగా స్త్రీలు అర్ధనగ్నంగా కళ్ళ ముందు కనబ డుతూ ఉంటే ఆ విధంగా వారి ఈ అవస రాన్ని తీర్చుకోగలరు. పైన చెప్పబడిన తర్కం ప్రకారం లైంగిక కోర్కెల విజృంభణ జరగకుండా ఉంటుంది".

పై సందేహ నివృత్తి

పైన ఉటంకించబడిన మాటలు పైకి ఎంతో హేతుబద్ధమైనవిగా, సమంజసమైనవిగా కనిపిస్తాయి. అంధయుగపు సమాజాలను అల్లకల్లోలం నుండి కాపాడటానికి ప్రతిపాదించబడిన గొప్ప అభ్యుదయ సూత్రాల్లాగా కనిపిస్తాయి. వాస్తవానికి ఇలాంటి సూచనలు, సలహాలు సమాజానికి ఎంతో హానికరమైనవి. ఇవి మానవ వ్యవస్థను మరింత అల్లకల్లోలానికి గురి చేస్తాయి. ఒకవేళ పై అభిప్రాయమే నిజమైనదయితే అమెరికా, యూరప్ దేశాల్లో కిడ్నాప్‌లు, మానభంగాలు, స్త్రీల పట్ల పురుషుల లైంగిక వేధింపులు మొదలగు అనైతిక నేరాల సంఖ్య తగ్గిపోవాల్సింది కదా? కొన్ని దేశాల్లోనయితే వ్యభిచార గృహాలు తామరతంపరలుగా కనిపిస్తాయి. అక్కడ వ్యభిచారిణుల తమ అందచందాలను ప్రదర్శిస్తూ, జనాన్ని ఆకర్షిస్తూ ఉంటారు. మరి ఇలాంటి లైంగిక విచ్చలవిడితనం వల్ల అక్కడ స్త్రీల కిడ్నాపింగ్‌లు తగ్గిపోయాయా? పురుషుల లైంగిక దాహం తీరి పోయిందా? స్త్రీలు ఆన్ని రకాల ప్రమాదాల నుండి సురక్షితంగా ఉంటున్నారా?

అమెరికాప్రభుత్వం అధికారిక వివరాలు

దేశంలో పెట్రేగుతున్న నేరప్రవృత్తి వాస్తవిక స్థితిని తెలుసుకునే ఉద్దేశ్యంతో అమెరికన్ ప్రభుత్వం ఒక సర్వే జరిపించింది. ఆ సర్వే రిపోర్టులోని ముఖ్యాంశాలను **'అమెరికాలో నేర ఉదంతాలు'** అన్న పేరుతో ఒక పుస్తకాన్ని కూడా వెలువరించటం జరిగింది. ఈ పుస్తకం అమెరికన్ ప్రభుత్వం తరపు నుండే ప్రచురించబడింది. అందులో ఆరవ పేజిలో **'అమెరికాలో ప్రతి ఆరు నిషిషాల్లో ఒక మానభంగం జరుగుతుంది. దాని కోసం ఆయుధాలను కూడా ఉపయోగించటం జరుగుతుంది'** అని పేర్కొనబడింది. ఇది 1988వ సంవత్సరానికి సంబంధించిన రికార్డు. ఆ పుస్తకంలోనే నేరాల సంఖ్య, అంకెలలో ఈ విధంగా పొందుపరచబడి ఉన్నాయి. అమెరికాలో మానభంగాలు:

సంవత్సరం	-	మానభంగాల సంఖ్య
1978 లో		1,47,389
1979 లో		1,68,134
1981 లో		1,89,450
1983 లో		2,11,691
1987 లో		2,21,764

పైన పేర్కొనబడిన లైంగిక నేరాల అంచనాల ద్వారా ఇంకా ఇలాంటి ఇతర విశ్వసనీయమైన వార్తల ద్వారా బోధపడే విషయమేమిటంటే, ఆయా దేశాల్లో లైంగిక నేరాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయే గాని తగ్గటం లేదు. ఈ విషయాన్ని మనం క్రింద పేర్కొన బడిన దివ్యఖుర్‌ఆన్ సూక్తికి క్రియాత్మక వ్యాఖ్యానంగా భావించవచ్చు.

telgo fbrvry.indd 8 4/8/12 12:42 PM

"ప్రవక్తా! నీ భార్యలకూ, నీ కూతుళ్లకూ, విశ్వాసుల స్త్రీలకూ తమ దుప్పట్ల కొంగులను తమపై వ్రేలాడ తీసుకోమని చెప్పు; వారు గుర్తింపబడటానికీ, వేధింపబడకుండా ఉండేందుకూ ఇది ఎంతో సముచిత మైన పద్ధతి". (అల్ అహ్‌జాబ్:59)

ఇమామ్ ఖుర్తుబీ తన వ్యాఖ్యాన గ్రంథంలో ఈ సూక్తి నేపథ్యం గురించి ఇలా వివరించారు: మరుగుదొడ్లు నిర్మించబడక ముందు స్త్రీలు కాలకృత్యాలు తీర్చుకోవటానికి సాధారణంగా దూరంగా ఉండే మైదాన ప్రాంతాలకు వెళ్ళేవారు. అలా వెళ్ళే స్త్రీలలో బానిసరాళ్ళు, స్వేచ్ఛాపరులైన స్త్రీలు కూడా ఉండేవారు. అయితే స్వేచ్ఛా పరురాళ్ళైన స్త్రీలు మాత్రం బురఖాలు ధరించి సౌశీల్యవతులుగా గుర్తించబడే వారు. దారిలో ఆకతాయి కుర్రవాళ్ళు బానిసరాళ్ళను వేధించేవారు. పైన పేర్కొనబడిన సూక్తి అవతరించక ముందు ఒక సారి ఒక విశ్వాసురాలైన స్త్రీ కాలకృత్యాలు తీర్చుకోవటం కోసం బహిర్భూమికి వెళ్ళింది. ఆమెను బానిసరాలిగా భావించి కొందరు తుంటరులు వెకిలి చేష్టలకు పాల్పడ్డారు.

ఆ స్త్రీ భయంతో కేకలు పెట్టింది. దాంతో వారు పలాయనం చిత్తగించారు. ఆమె వెళ్ళి దైవప్రవక్త (స) కు ఫిర్యాదు చేసింది. అప్పుడే ఈ సూక్తి అవతరించింది. చెప్పొచ్చేదేమిటంటే, వీధుల గుండా వస్తూ పోతూ ఉండే మగవారి ముందు తమ సౌందర్యాన్ని ప్రదర్శించే స్త్రీలు వాస్తవానికి తోడేలు మనస్తత్వం గల పురుషుల ముందు తమల్ని తాము సమర్పించుకుంటున్నారనే నిజాన్ని గ్రహించాలి. ఎందుకంటే పరదా రాహిత్యం అనేది కోర్కెల్ని కవ్విస్తుంది. దీనికి భిన్నంగా పరదా ధరించే స్త్రీలు లైంగిక వాంఛల్ని జనింపజేసే తమ అలంకరణను, శరీరావయవాలను మరుగున ఉంచుకుంటారు. కేవలం మొహం, అరచేతులు తప్ప వారి శరీరంలో మరేమీ కానరావు.మరి కొంత మంది పండితులయితే కేవలం కళ్ళు మాత్రమే కనిపించాలంటారు. మొత్తానికి ఆ విధంగా నిండుగా పరదా ధరించి తమ అందచందాలను, శరీరభాగాల్ని కప్పి పుచ్చుకునే, ముఖం అరచేతులు తప్ప వారి శరీరభాగం ఏదీ బయటకు కనిపించని విధంగా, మరి కొందరి దృష్టిలో కళ్ళు తప్ప మరేమీ కనిపించని విధంగా పరదా పాటించే ఆ స్త్రీలు ఎటువంటి లైంగిక కోర్కెల్ని ఏ విధంగా రెచ్చగొడ్తారు? అలాంటి స్త్రీ సమాజంలో ఏర్పడే అపసవ్యతలకు కారణభూతం అవుతుందా? స్త్రీలు కష్టాలకు, ఇబ్బందులకు లోను కాకూడదన్న ఉద్దేశ్యం తోనే దేవుడు వారికి పరదా పద్ధతిని విధించాడు. ఫ్యాషన్లు ఇతర నగ్న దృశ్యాలు లైంగిక నేరాలను పెంచి పోషిస్తాయనీ, అణిగి ఉండే లైంగిక కోర్కెల్ని కవ్విస్తాయనే విషయం దేవునికి బాగా తెలుసు. ఈ విషయాలన్నిటిని చదివి కూడా ఎవరయినా తమ అభిప్రాయమే సహేతుకమైనదని పట్టుపట్టి మొండిగా వాదిస్తే వారి ఆలోచనా వికాసం కోసం మేము క్రింద నాలుగు వాస్తవాలను పేర్కొంటున్నాం, గమనించగలరు.

మొదటి వాస్తవం: పైన పేర్కొనబడిన నేరాల సంఖ్య వారి వాదనను త్రోసిపుచ్చుతోంది.

రెండవ వాస్తవం: స్త్రీ పురుషులిద్దరిలోనూ లైంగిక వాంఛలు ఉన్నాయి. దేవుడు ఎన్నో కారణాల దృష్ట్యా వాటిని ఇరువురిలోనూ పొందుపరచాడు. వాటిలో సంతానోత్పత్తి పరిరక్షణ కూడా ఒకటి. ఈ పరిస్థితి గనక లేకపోతే జాతి ఎలా మిగిలి వుంటుంది? అన్న విషయాన్ని మనం గమనించాలి. సహజమైన ఈ కోర్కెల్ని ఎవరూ తిరస్కరించలేరు. మరలాంటప్పుడు పురుషులు నగ్న, అశ్లీలమైన దృశ్యాలు చూసి కూడా తమ సహజమైన కోర్కెల్ని అదుపులో పెట్టుకోగలరని ఎలా ఆశించగలం?

మూడో వాస్తవం: స్త్రీల అలంకరణ, అందచందాలు పురుషుల్లో అంతర్లీనమై ఉండే లైంగిక వాంఛల్ని కవ్విస్తాయన్నది ఒక వాస్తవికమైన విషయం. స్త్రీ ముఖారవిందం గాని, ఇతర అవయవాలు గాని ఏవీ ఇందుకు తీసిపోవు. ఏ ప్రకృతి ధర్మం పై దైవం తనను సృష్టించాడో, దాన్ని వ్యతిరేకించడం, ఇటువంటి భావోద్రేకాలను రెచ్చగొట్టే దృశ్యాలను చూసిన తర్వాత కూడా తన సహజ కోర్కెలను అణచుకోవడం అసాధ్యం.

నాల్గో వాస్తవం: లైంగిక వాంఛల్ని కవ్వింపజేసే అశ్లీల దృశ్యాలను సర్వ సామాన్యం చేయటం ద్వారానే తమ లైంగిక కోర్కెల్ని నియంత్రించుకోవడానికి అదే సరైన చికిత్స అని భావించుకున్నట్లయితే, దానివల్ల రెండు ఫలితాలు ఎదురవుతాయి.

మొదటిది: నగ్న, అశ్లీలమైన దృశ్యాలు చూసి కూడా ఎలాంటి భావోద్రేకాలకు లోనుకాని పురుషులు వాస్తవానికి నపుంసకులు. ఎందుకంటే వారి లైంగిక శక్తి అంతరించిపోయి ఉంటుంది. కనుకనే వారికి అలాంటి తలంపులు రావటం లేదు.

రెండోది: బహిరంగంగా నగ్న, అశ్లీలమైన దృశ్యాలు చూసినప్పటికీ లైంగిక వాంఛలు కలగటం లేదంటే బహుశా అలాంటి పురుషుల్లో లైంగిక పరమైన వ్యాధులు ఉండి ఉండవచ్చు.

ఈ సందేహంలోని సత్యత గురించి వాదిస్తున్నట్లయితే వారు మన సమాజంలోని పురుష గ్రూపులకు చెందిన పరుషులలో చేరిపోగోరుతున్నారా?

అసంతృప్తి (నో కన్విక్షన్)

ఇది రెండో అనుమానం. దీన్ని అనుమానం అనడంకన్నా మనోవాంఛలకు దాసోహం అంటే బాగుంటుంది. పరదా పాటించని స్త్రీని ఉద్దేశ్యించి **'మీరు పరదా పాటించరెందుకండీ?'** అని అడిగితే, దానికి ఆమె నేనింకా సంతృప్తి చెందలేదు. సంతృప్తి కలిగినప్పుడు ఇన్షా అల్లాహ్ పరదా పాటిస్తాను అని సమాధానమిస్తుంది ఈ విధంగా జవాబు చెప్పే సోదరీమణులు రెండు విషయాల మధ్య భేదం పాటించాలి. అవి:

మొదటి విషయం **"దైవాజ్ఞ"**

రెండో విషయం **"మానవాజ్ఞ"**

(పరదా పాటించాలన్నది **దైవాజ్ఞ** లేదా **మానవాజ్ఞ అన్న విషయం వచ్చే సంచిక లో తెలుసుకుందాం!**)

telgo fbrvry.indd 9 4/8/12 12:42 PM

సయ్యిద్ అహ్మద్

సమర్పణ-అనుసరణ

సృష్టికర్త అయిన అల్లాహ్ తన దాసులను సృష్టించి, వారి జీవితలక్ష్యం తెలియజెయ్యటకు ప్రతిజాతిలో ప్రవక్తలను గ్రంథాలను అవతరింపజేశాడు. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "మేము ప్రతి సముదాయం లోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా(ప్రజలారా!) అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి ఆయన తప్ప ఇతరత్రా మిథ్యా దైవాలకు దూరంగా ఉండండి."

(అన్ నహ్ల్:36)

ఎప్పుడైతే భూమిపై నిజ ధర్మ జ్ఞానం తగ్గు ముఖం పడుతుందో, ఎప్పుడైతే దాసులు సృష్టికర్తను వదలి సృష్టిని ఆరాధిస్తారో, పుణ్యాత్ములను దైవానికి సమానంగా చేస్తారో, ఎప్పుడైతే తన మనోభావానికి తోచినట్లు దైవాలు సృష్టించుకుంటారో, కులానికొక దేవుడు, వర్గానికికొక దేవుడని భావించుకుంటారో కులమత వర్గాల భేదాలలో చిక్కుకుని శత్రువులుగా మారుతారు. మానవ గౌరవం భంగం అవుతుంది. బలవంతులు బలహీనులపై దౌర్జన్యం చేస్తారు. రక్తం ఏరులై పారుతుంది. స్త్రీ యొక్క గౌరవమర్యాదలు బజారుపాలవుతాయి. సమాజం అంధకారంలో పడిపోతుంది. అలాంటప్పుడు అల్లాహ్ తన దాసులపై కరుణించి వారిని హెచ్చరించేందుకు ప్రవక్తలను పంపుతాడు. **"ఒక ప్రవక్తను పంపనంత వరకూ ఎవరినయినా శిక్షింటం మా సంప్రదాయం కాదు."**

(బనీ ఇస్రాయీల్:15)

మానవ జీవితం పెడమార్గానికి గురి అయినప్పుడల్లా అల్లాహ్ మానవులకు సన్మార్గం తెలియజేస్తాడు. "తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి దాన్ని ఇతర ధర్మాలన్నింటిపై పైచేయిగా ఉండేలా చేయటానికి పంపిన వాడు ఆయనే.(దీనికి)సాక్షిగా అల్లాహ్‌యే చాలు."

(అల్ ఫతహ్:28)

ఇదే విధంగా మానవులను రుజుమార్గం చూపేందుకు అల్లాహ్ చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్(స)ను పంపాడు.

"ముహమ్మద్(స) ఒక ప్రవక్త మాత్రమే. ఈయనకు పూర్వం కూడా (చాలామంది) ప్రవక్తలు గతించారు." (ఆలిఇమ్రాన్:144)

ముహమ్మద్(స) జీవితం మానవులు ఆదర్శం కొరకు తీర్చిదిద్దిబడినది. ఆయన (స) ద్వారానే మనకు నిజదైవ జ్ఞానం తెలియజేయబడినది. ప్రళయం వరకూ వచ్చే ప్రతి సందేహమునకు సమాధానం ప్రతి సమస్యకు పరిష్కారం ఆయన(స) చూపిన మార్గంలోనే ఉంది.

"నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది."

(అల్‌అహ్‌జాబ్:21)

అల్లాహ్, తన ప్రవక్త విధేయతను దాసులపై విధిగా చేయటమే కాకుండా అల్లాహ్ విధేయత ప్రవక్త విధేయతలోనే ఉందని సెలవిచ్చాడు: "ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే" (అన్నిసా:80)

ఈ పవిత్ర ధర్మాన్ని ఆచరించటానికి దైవ ప్రవక్త(స)ను ఆదర్శమూర్తిగా పేర్కొనడం జరిగియింది. ఆయన(స) గారి ఉత్తమ ఆదర్శాన్ని ఎల్లప్పుడూ ప్రతి విషయంలో దృష్టిలో పెట్టుకొని మసలుకోవటం ప్రతి ముస్లింకు విధిగా చెయ్యబడింది. "దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే, దాన్ని వదిలి పెట్టండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ కఠినంగా శిక్షించగలవాడు". (అల్ హష్ర్:7)

మనం నిజమైన సృష్టికర్తకు నిజమైన ప్రేమికులే అయితే ప్రవక్త(స) పద్ధతులను తు.చ తప్పకుండా పాటించాలి, తద్వారా అల్లాహ్ మన పాపాలను మన్నించే అవకాశం ఉంది.

"(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: 'మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపార కనికరించేవాడు."

(ఆలి ఇమ్రాన్:31)

ఈ ఆయతు ద్వారా అల్లాహ్ తనపట్ల ప్రేమకు, ప్రసన్నతకు సంబంధించిన ఒక 'గీటురాయి'ని నిర్ధారించాడు, ఆ 'గీటురాయి'పై మేలిమి అని తేలినవారు సాఫల్యం పొందినట్లే లెక్క. లేకుంటే అతని ప్రేమ బూటకమైందని అర్థం. అలాంటి వ్యక్తి లక్ష్యసాధనలో విఫలుడైనట్లే. దైవ ప్రవక్త (స) స్వయంగా ఇలా ప్రవచించి ఉన్నారు: "మాతో సంబంధం లేని-అంటే మేము చూపిన పద్ధతికి భిన్నమైన-రీతిలో ఎవరయినా ఏదన్నా ఆచరిస్తే అది త్రోసిపుచ్చదగినది". (బుఖారి, ముస్లిం)

అంటే దైవప్రవక్త(స) విధానాన్ని అనుసరించటం వల్ల పాపాలు క్షమించబడటమే కాకుండా, దైవానికి ప్రియతములుగా కూడా ఖరారు చేయబడతారు.

అల్లాహ్ ఏ వ్యక్తికినైతే ప్రేమిస్తాడో అతని గురించి జిబ్రయీల్ అలైహిస్సలాం నుద్దేశించి ఇలా అంటాడు:

"ఓ జిబ్రయీల్! అతన్ని నీవు కూడా ప్రేమించు, తర్వాత జిబ్రయీల్ దైవదూత ఆకాశాలలో ఈ వార్త అందజేస్తూ ఇలా అంటారు: అల్లాహ్ ఈ దాసున్ని ప్రేమిస్తున్నాడు, నేను కూడా ప్రేమిస్తున్నాను, మీరు కూడా ప్రేమించండి. కనుక యావత్ భూమండలంలో ఆ వ్యక్తి ప్రేమించబడతాడు.

(మిగతాది 15 వ పేజీలో)

telgo fbrvry.indd 10 4/8/12 12:42 PM



క్రైస్తవులు, హిందువులు దేవుడున్నాడని నమ్మే ప్రజలు. కాని నాస్తికుల దేవుని పట్లగానీ, దైవ ప్రవక్తల పట్లగానీ ఎలాంటి నమ్మకం ఉండదు. అలాంటప్పుడు మహా ప్రవక్త ముహమ్మద్ (స) నాస్తికుల కోసం కూడా వచ్చిన ప్రవక్త ఎలా అవుతారు. నాస్తికులు ఆయన్ను దైవ ప్రవక్తగా ఎలా అంగీకరిస్తారు?

నాస్తికులు కూడా మనుషులే. ఆది మానవుడు ఆదం (అ) సంతతిలోని వారే కదా! వారు ఎందుకు నాస్తికులుగా మారారు. దేవుడిని, దైవ ధర్మాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? అని కొందరు ప్రశ్నించవచ్చు. దేవుడ్ని గురించి ఎలాంటి హేతువు లేని, అర్థం లేని కల్పిత గాధల వల్ల, మత వ్యవస్థ మతావలంబీకులు ఒడిగట్టిన కొన్ని అక్రమాల కారణంగా వారు తిరుగుబాటు కు పూనుకున్నారనీ, దేవుడిని, దైవ ధర్మాన్నీ తిరస్కరించే వారుగా మారారని కొందరి వాదన.

దైవాన్ని వ్యతిరేకిస్తూ, దూషించే నాస్తికులంటే దయ్యాలాంటి వారని కొందరు ఖండిస్తుంటారు. కాని, ఇస్లాంలోని జ్ఞానాన్ని గ్రహిస్తే నాస్తికులను నిందించే పని మనం చేయలేము. నిజమైన ముస్లిం నాస్తికుల పట్ల సానుభూతి చూపుతాడు. అదెలాగంటే–

+ నాస్తికులు తల్లి ఒడిలోని బిడ్డలాంటివారు. వారిలో దివ్య జ్ఞానాన్ని గ్రహించే దృష్టి అభివృద్ధి చెందలేదు.
+ వారు తమకు త్రాగడానికి లభించే పాలను గుర్తిస్తున్నారు కాని ఆ పాలను ఎవరు సృష్టించాడో గుర్తించడం లేదు.
+ వారు ఏడుస్తారు, కోపిస్తారు, చివరకు తమకు పాలిస్తున్న తల్లి ని కాలితో తన్నుతారు కూడా.

అబ్దుల్లా అడియార్

ఒక బిడ్డ తల్లిని కాలితో తన్నితే, తల్లి చిరునవ్వుతో బిడ్డకు పాలు పడుతుంది. మరి దేవుడు తన దాసుల పట్ల 70 తల్లులకన్నా అధిక ప్రేమ గలవాడు అని ప్రవక్త (స) చెప్పారు కదా! కాబట్టి నాస్తికులకు కూడా వారు తనను వ్యతిరేకిస్తున్నప్పటికీ, తనపై నిప్పులు తొక్కుతున్నప్పటికీ ఆహారం అందజేస్తాడు. దేవుని దృష్టిలో నాస్తికులు తమ సృష్టికర్తను గ్రహించే జ్ఞా నం లేని బిడ్డల వంటివారు. నాస్తికుల పట్ల ఇంత దయకు కారణం–దేవుడు అపార కృపాశీలుడు కావడమే.

ఖుర్‌ఆన్‌లో ప్రవక్త ముహమ్మద్ (స)ను మానవాళి పట్ల కారుణ్యంగా అభివర్ణించడాన్ని గుర్తు చేసుకొంటే మనకు కొన్ని విషయాలు అర్థమవుతాయి. అపార కృపాశీలుడైన ఆ దేవుడు మానవాళికి ఒక కారుణ్యాన్ని ప్రసాదించాడు. ఆ కారుణ్యం నాస్తికుల పట్ల కూడాను. వారూ మానవాళిలో భాగమే. కాబట్టి దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారికి కూడా ప్రవక్తయే.

ఈ విషయాన్ని నేనొక ఉదాహరణ ద్వారా వివరిస్తాను. ఒక కాలేజీ ప్రిన్సిపల్ ఒక లెక్చరర్‌ను క్లాసులో పంపాడు. అంటే ఆ లెక్చరర్ క్లాసులోని విద్యార్థులందరికి ఉపాధ్యాయుడు. కొందరు విద్యార్థులు అతడిని తమ లెక్చరర్‌గా ఒప్పుకోకపోయినప్పటికీ అతడు వారికి కూడా ఉపాధ్యాయుడే. అదే విధంగా మహా ప్రవక్త ముహమ్మద్ (స) దేవుని తరఫున సర్వమానవాళి కోసం పంప బడినవారు. నాస్తికులు అంగీకరించినా, అంగీకరించకపోయినా ఆయన వారికి కూడా దైవ ప్రవక్తయే.

అయితే నేడు ప్రపంచంలోని నాస్తికులను గమనిస్తే వారు ప్రపంచంలోని మతాలన్నిటినీ, ప్రవక్తలందరినీ నిందిస్తారు, విమర్శిస్తారు. కానీ, ఆశ్చర్యమేమంటే ఇస్లాంను, ఇస్లాం ప్రవక్తను ఆదరించే, గౌరవించే హేతువాదులు అనేకమంది ఉన్నారు. ప్రఖ్యాత నాస్తికుడు ఇంగర్‌సాల్ ఇస్లాంను ప్రాపంచిక ధర్మంగా ప్రశంసిస్తూ **'మధ్యయుగ క్రైస్తవ బోధకులు స్వర్గం గురించి ప్రచారం చేస్తున్న కాలంలో ఇస్లాం ప్రపంచంలోని విజ్ఞత గురించి బోధించింద'**ని అన్నాడు.

తమిళనాడుకు చెందిన పెరియార్ ఇ.వి. రామస్వామి రాజీ పడని నాస్తికులు. ఆయన ఇస్లాం గురించి మాట్లాడుతూ 'ఇస్లాం బానిసత్వం నుంచి విముక్తి, అంటరానితనానికి ఔషధం; అని ప్రకటించారు. అంతే కాదు ఇస్లాం స్వేచ్ఛను, స్థయిర్యాన్ని, విజ్ఞతను అందరికీ ప్రసాదిస్తుందని చెప్పారు.

పెరియార్ రామస్వామి శిష్యుడు డా. అన్నాదురై ఇస్లాం గురించి చెబుతూ ఇస్లాం ప్రతి విషయాన్నీ బోధిస్తుందనీ, మంచి విషయాలన్నీ వివరిస్తుందని అన్నారు. ఇస్లాం ప్రత్యేకత ఏమిటంటే, ఇస్లాం బోధనలు మహా ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా ఆయన జీవిత కాలంలో నిరూపించబడ్డాయి. నిరూపణ లేని బోధన ఏదీ లేదు. "ఆయన చిరునవ్వు మధురమైన మాటలు, హద్దులెరుగని సహనం నన్ను ఆయనకు అభిమానిగా మలిచాయి' అన్నారు అన్నాదురై.

మహా ప్రవక్త ముహమ్మద్ (స) నాస్తికుల అభేద్య హృదయాలలో చొచ్చుకుపోయి వారిని తన అభిమానులుగా మార్చుకున్నారు. మరే ఇతర మతానికి చెందిన ప్రవక్తకు ఇది సాధ్యపడలేదు.

(అబ్దుల్లాహ్ అడియార్ గారి ప్రసంగం ముగిసిన తర్వాత ద్రావిడ ఉద్యమానికి చెందిన స్థానిక నాయకుడు, అన్నాదురై అభిమాని 'కారికాలన్' లేచి తాను సత్య ధర్మాన్ని అవలంబించానని ప్రకటించాడు. మద్రాస్‌లోని మింట్ స్ట్రీట్‌లో ఈ సభ జరిగింది.)

telgo fbrvry.indd 11 4/8/12 12:44 PM

అనువాదం
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

"ఎవడయితే ఇస్లాంలో లేని పోని ఆచారాన్ని సృష్టించి దానిని 'సదాచారం' గా భావించాడో అతను మహాప్రవక్త ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని శంకించాడు. అంటే సందేశాన్ని అందజేసే విషయంలో ముహమ్మద్ (స) వల్ల ఏదో వెలితి జరిగిందని భావించిన వాడవుతాడు. ఎందుకంటే అల్లాహ్ చాలా స్పష్టంగా ఇలా సెలవిచ్చాడు :

"ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను". (అల్ మాయిదా -3)

ఇక బిద్అత్ యొక్క నిఘంటు అర్థం దృష్ట్యా బిద్అత్‌ను ప్రస్తుతిస్తూ కొన్ని హదీసులు కూడా ఉన్నాయి. అంటే షరీయత్‌లో ధృవీకరించబడిన పనులేగాని మరపింపబడిన పనులు. దైవ ప్రవక్త (స) వాటి గురించి తన అనుచరులకు ఉపదేశిస్తూ వాటిని చేయ మని ప్రోత్సహించారు. ఉదాహరణకు-ఆయన (స) ఇలా ఉద్బోధిం చారు: "ఎవరయినా ఇస్లాంలో ఏదన్నా మంచి పద్ధతిని మొదలెడితే అతనికి దాని పుణ్యఫలం లభిస్తుంది. ఆ తరువాత దాన్ని అనుసరిం చిన వారి పుణ్యం కూడా అతనికి చేరుతుంది. మరైతే దాన్ని అనుస రించిన వారి పుణ్యఫలంలో ఎటువంటి కోతా విధించబడదు."

(ముస్లిం)

బిద్అత్ యొక్క ఈ భావార్థంలోనే హజ్రత్ ఉమర్ (ర) గారి పలుకులు గమనార్హమైనవి. ఆయన (ర) ఇలా అన్నారు: 'ఇదెంతటి భాగ్యవంతమైన బిద్అతో!'

తరావీహ్ నమాజ్(సామూహికంగా) ఆచరించటం గురించి ఆయన చెప్పిన మాటలివి. ఎందుకంటే ఈ నమాజు అంతకు ముందు నుంచే షరీయతు బద్ధంగా ఉన్నది. దైవప్రవక్త(స) దాని గురించి ప్రోత్సహించి ఉన్నారు. ఆయన (స) స్వయంగా కూడా మూడు రాత్రుల వరకూ తరావీహ్ నమాజును సామూహికంగా చేశారు. అయితే ఇది అనుచరసమాజంపై ఎక్కడ విధిగా మోపబడుతుందోనన్న భయంతో దాన్ని విడనాడారు. అయితే హజ్రత్ ఉమర్ (ర) తాను ఖలీఫాగా ఉన్న కాలంలో ఈ తరావీహ్ నమాజును సామూహికంగా సలపమని ప్రజలకు ఆదేశించారు.

ప్ర: కాపట్యం (నిఫాఖ్) ఎన్ని రకాలు?

జ: కాపట్యం (నిఫాఖ్) రెండు రకాలు. 1. విశ్వాసపరమైన కపటత్వం. 2. క్రియాత్మకమైన కపటత్వం.

1. విశ్వాసపరమైన కపటత్వం:

ఇది పెద్ద తరహా కాపట్య రోగం. దీని లక్షణం ఏమిటంటే ఒక వ్యక్తి పైకి విశ్వాసం (ఈమాన్) ప్రకటిస్తాడు. కాని లోపలి నుంచి కపటిగా ఉంటాడు. అతని ఆంతర్యంలో కాపట్య జబ్బు తిష్ఠవేసి ఉంటుంది. పైకి మాత్రం విశ్వాసిగా నటిస్తాడు. ఈ రకమైన పోకడ అతన్ని ఇస్లాం పరిధినుంచి వెలుపలికి నెట్టేస్తుంది. ఒకవేళ ఎవరయినా ఈ స్థితిలోనే మరణిస్తే అతను ముస్లింగా మరణించడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "కపటులు నిశ్చయం గా నరకంలోని అధమాతి అధమ శ్రేణిలోనికి పోతారు". (అన్‌నిసా - 145) ఈ రకమైన కపట విశ్వాసులు తరచూ అల్లాహ్‌ను, సాటి విశ్వాసులను మోసగిస్తూ ఉంటారు. ముస్లింల ను పరిహసిస్తూ ఉంటారు. ముస్లిములకు వ్యతిరేకంగా అవిశ్వా సులను సహాయం చేస్తు ఉంటారు. ఒకవేళ వారు ఎప్పుడయినా, ఏదయినా మంచి పని చేసినా తద్వారా ప్రాపంచిక ప్రయోజ నాలు పొందజూస్తారు.

2. క్రియాత్మక కపటత్వం:

ఇది చిన్న తరహా కాపట్య రోగం. ఈ జబ్బు ఉన్న వాళ్ళు ఇస్లాం పరిధి నుండి తొలగిపోరు గాని వారు పశ్చాత్తాపం చెందకుండా అదే విధంగా ప్రవర్తిస్తున్నట్లయితే రోగం ముదిరే ప్రమాదముంటుంది.

ఈ రకమయిన కపటుల లక్షణాలేవంటే, వారు మాట్లాడినపుడు అలవోకగా అబద్ధాలు చెబుతారు. వాగ్దానం చేస్తే దాన్ని నెర వేర్చరు. ఎవరితోనయినా గొడవ పడితే తిట్ల పురాణం మొదలె డతారు. ఆడిన మాట తప్పుతారు. వారి దగ్గర ఏదైనా వస్తువును అప్పగింతగా పెడితే అందులో ద్రోహం చేస్తారు.

ధార్మిక సోదరులారా! ఆత్మ పరిశీలన చేసుకోండి. కొంప తీసి ఈ రోగ లక్షణాలు మీలోనైతే లేవు కదా!?



telgo fbrvry.indd 12 4/8/12 12:46 PM



మక్కాలో ముస్లిమేతరులకు ప్రవేశం ఎందుకు లేదు?

ప్రశ్న: మక్కా మదీనాల్లో ముస్లిమేతరులకు ప్రవేశ అనుమతి ఎందుకు లేదు?

జవాబు: ఇస్లామీయ ధర్మశాస్త్రానుసారం మక్కా, మదీనా నగరాల్లో ముస్లిమేతరుల ప్రవేశంపై నిషేధముందనే విషయం వాస్తవమే. ఈ నిషేధంలో గుప్తమైవున్న కారణాలేమిటో, ఈ అంశాల ద్వారా విశదమవుతుంది.

1.పౌరులందరికీ కంటోన్మెంట్ ఏరియాలో ప్రవేశించ అనుమతి ఉండదు

నేనొక భారత పౌరుణ్ణి. అయినప్పటికీ (భారతదేశంలోనే) కొన్ని నిషేధిత ప్రాంతాలకు, ప్రత్యేకించి సైనిక స్థావరాలున్న (కంటోన్మెంట్) ప్రాంతాలకు వెళ్ళే అనుమతి ఉండదు. ప్రతి దేశంలో ఇలాంటి కొన్ని ప్రాంతాలుంటాయి, అక్కడ సామాన్య పౌరులు ప్రవేశించలేరు. ప్రత్యేకించి సైనిక స్థావరాలున్న (కంటోన్మెంట్ ఏరియాలో) ప్రాంతాల్లో సైన్యంతో సంబంధమున్న పౌరులు మాత్రమే లేక రక్షణ విభాగానికి చెందిన ఉద్యోగులు మాత్రమే పోగలుగుతారు.

ఇదే విధంగా ఇస్లామీయ ధర్మం కూడా ఒక విశ్వవ్యాపిత ధర్మం, సర్వమానవాళి కోసం అవతరించిన ధర్మం. ఇస్లాంలో కూడా రెండు నగరాలు మక్కా, మదీనాలు సైనిక స్థావరాల్లాగే అత్యంత ప్రాముఖ్యమైనవి. ఈ నగరాలకు ఇస్లాంను విశ్వసించేవారు, మరియు దాని రక్షణలో పాలుపంచుకోగలిగే వారు మాత్రమే పోగలుగుతారు.అంటే ఇక్కడ కేవలం ముస్లింలు మాత్రమే ప్రవేశించగలుగుతారు.

సైనిక స్థావరాల్లో సామాన్య పౌరుల ప్రవేశంపై గల నిషేధంపై నిరసన తెలుపటం, బుద్ధివివేకాల రీత్యా ఎలా అసమంజసమో, అదేవిధంగా ఇస్లాంను విశ్వసించని వారిపై మక్కా మదీనాలలో ప్రవేశం గల నిషేధంపై నిరసన తెలుపటం, దాన్ని తప్పుగా వర్ణించటం కూడా అలాగే అర్థరహితమైనది.

2.మక్కా,మదీనాలో ప్రవేశించటానికి (వీసా) అనుమతి పత్రం

(అ) ఎవరైనా ఓ వ్యక్తి ఇతర దేశాన్ని సందర్శించదలిచినప్పుడు, ఆ దేశంలో అతను ప్రవేశించటానికి అనుమతి పత్రం (వీసా) కోసం దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉంటుంది. ప్రతిదేశం తన చట్టాల్ని, నియమనిబంధనల్ని, అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని, వాటిని అనుసరించే వీసాలు జారీ చేస్తుంది. ఆ దేశ వీసా కొరకు అవసరమైన షరతులన్నిటినీ పూర్తిచేయనంతవరకు, ఆ దేశపు వీసా జారీచేయబడదు.

(ఇ) వీసాలు జారీచేసే విషయంలో అమెరికా అత్యంత కఠినవైఖరిని అవలంబిస్తుంది. ప్రత్యేకించి మూడవ ప్రపంచ పౌరులకు వీసా జారీ చేయటానికి పూర్వం అనేక రకాల నియమనిబంధనల్ని, షరతుల్ని పూర్తి చేయనిదే, వీసా అసలే జారీ చేయరు.

(ఉ) నేను సింగాపూర్ దేశానికి వెళ్ళినప్పుడు, అక్కడి ఇమిగ్రేషన్ ఫారం మీద "మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేసేవారికి మరణశిక్ష విధించబడుతుంది" అని వ్రాసి ఉండటం గమనించాను. మనం ఒకవేళ సింగపూర్ పోదలచుకుంటే, అక్కడి చట్టాలననుసరించి మసలుకోవాల్సి ఉంటుంది. 'వారి వద్దనున్న మరణ శిక్ష ఒక క్రూరమైన చర్య'గా నేనెంతమాత్రం పేర్కొనలేను. వారి షరతుల కు అవసరాలకు, చట్టాలకు కట్టుబడి ఉంటానని అంగీకరించిన తరువాతనే నేనక్కడికి వెళ్ళటానికి అనుమతి లభించింది.

(ఋ) మక్కా, మదీనాల్లో ప్రవేశించటానికి ప్రాథమిక షరతు నోటితో **'లా ఇలాహ ఇల్లల్లాహు-ముహమ్మదుర్ రసూలుల్లాహ్'** అంటే-'అల్లాహ్ తప్ప వేరెవ్వరూ ఆరాధ్యనీయుడు కాదు మరియు ముహమ్మద్(స) ఆయన ప్రవక్త' అని పలికి హృదయపూర్వకంగా విశ్వసించాల్సి ఉంటుంది.

telgo fbrvry.indd 13 4/8/12 12:46 PM

పాకశాల – కువైటీ వంటకాల పాఠశాల

టొమాటో మరియు బీన్స్ సూపు

కావలసిన సామగ్రి:
హుమూస్ (శెనగలు): 1 కప్పు.
రాజ్‌మా ఎర్ర బిన్నీసు: 1 కప్పు.
తెల్ల బిన్నీసు: 1 కప్పు.
ఉల్లిపాయలు: 4 మీడియమ్ సైజుగలవి
తొక్క తీయబడిన టమాటాలు : 10.
కొత్తిమీర: 1 కట్ట.
బఖుల్: 1 కట్ట.
బఖ్‌దూనిస్(విలాయతీ మెంతం కూర): 1 చిన్న కట్ట .
ఉల్లిపాయ ఆకులు: 6 కాడలు.
షఅరియహ్(నూడుల్సు)సేమియాలు: 3/4 కప్పు.
జుబ్బ (బట్టరు): 2 టేబులు స్పూన్లు.
నూనె: 1/2 కప్పు.
వెల్లుల్లిపాయలు: 3 టేబుల్ స్పూన్లు
చికెను మ్యాగి సూపు బిళ్ళలు: 3 బిళ్ళలు
ఎర్ర మిరపకాయల (చప్పటి)పొడి:2 టీ స్పూను.
జీలకర్ర పొడి: 2 టీ స్పూన్లు.
ధనియాల పొడి: 2 టీ స్పూన్లు
ఘాటు లేని మసాలాలు(బహోర్‌హలూ: 2 టీ స్పూన్లు
నీరు: 1 2 కప్పులు
ఉప్పు: అభిరుచికి తగినంత

తయారు చేయు పద్ధతి:

– శెనగలు మరియు బీన్సు శుభ్ర పరచుకుని రెండింటినీ నీటిలో కనీసం 5 గంటలు నాన బెట్టాలి. ఆ తరువాత 9 కప్పులు నీరు పోసి 2 గంటలు ఉడక పెట్టాలి, (సగము ఉడికిన తరువాత ఉప్పేసి చిన్న మంటపై ఉడకనివ్వాలి)

– సూపు తయారు చేయుటకు సరిపడునంత పెద్ద గిన్నె తీసికుని దానిలో నూనె పోసి వేడైన తరువాత తరిగిన ఉల్లిపాయలు వేయాలి. అవి ఎర్రగా వేగిన తరువాత వెల్లుల్లిపాయలు మరియు మ్యాగి బిళ్ళలు వేయాలి.

– టమాటాలను చిన్న చిన్న ముక్కలుగా తరిగి వేగిన ఉల్లిపాయల్లో వేసి మూత పెట్టి మెత్తపడునంత వరకు ఉంచాలి. తరువాత అందులో అన్ని మషాలాలు వేయాలి.

– ఉడకపెట్టిన బఖూల్‌ను (బిన్నీసు గింజలను) నీటితో సహా టమాటాలపై వేయాలి, అందులో 3 కప్పుల వేడి నీరు పోసి గట్టిగా మూత పెట్టి చిన్న మంటపై ఒక గంటన్నర వరకు అలాగే ఉంచాలి.

– చిన్నగా తరిగిన కూరగాయలను వేసి మరల అరగంట ఉడక నివ్వాలి, ఆ తరువాత సేమియాలు (నూడుల్సు) వేసి అరగంట ఉడకనివ్వాలి. చివర్లో జబ్బ వేసి కాస్త (సూపు) షోర్బాలో కలిపి సర్వ్ చేయాలి.

ప్రవక్త పరిమళం

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై ప్రేమ

అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖనం: అల్లాహ్ యొక్క సందేశహరుని (స)తో ఓ పల్లెటూరి వ్యక్తి (ఎడారి వాసి) అన్నాడు– 'ఆ ప్రళయ ఘడియ ఎప్పుడు? రసూలుల్లాహ్ (స) అతనితో అన్నారు: **"దాని కొరకు నీవు ఏమి సిద్ధం చేసుకున్నావు?"** అతను చెప్పాడు: 'అల్లాహ్ మరియు ఆయన సందేశహరునిపై ప్రేమ'. ఆయన (స) అన్నారు: **"నీవు ఎవరినైతే ప్రేమిస్తావో వారితోనే ఉంటావు".** (ముస్లిం)

సత్యం –అసత్యం

అబ్దుల్లాహ్(ర) ఉల్లేఖనం– అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు: "మీరు సత్యవంతులుగా ఉండాలని ఆదేశిస్తున్నాను, సత్యసంధత ధర్మపరాయణతకు దారి తీస్తుంది మరియు ధర్మ పరాయణత స్వర్గానికి దారి తీస్తుంది. ఒక మనిషి సత్యసంధతను అవలంబిస్తాడు. సత్యమే పలుకుతూ ఉంటాడు. చివరికి అల్లాహ్ దగ్గర అతడు సత్యసంధుడని నామకరణం చేయబడతాడు. మరియు అసత్యం విషయంలో జాగ్రత్త పడండి, అబద్ధాలు పలకడం దుర్మార్గానికి దారి తీస్తుంది మరియు దుర్మార్గం నరకానికి దారి తీస్తుంది. ఒక మనిషి అబద్ధాలు చెప్పనారంభిస్తాడు చివరికి అల్లాహ్ దగ్గర అతడు అబద్ధాలకోరు అని నమోదు చేసుకోబడతాడు. (ముస్లిం)

మిక్కిలి పరిపూర్ణుడైన విశ్వాసి

అబూ హురైరా (ర) ఉల్లేఖనం– అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: **'విశ్వాసంలో మిక్కిలి పరిపూర్ణుడైన విశ్వాసి ఉత్తమ నడవడికను కలిగినవాడే'.** (అబూ దావూద్)

పరిపూర్ణ విశ్వాసం

అబూ ఉమామహ్ (ర) ఉల్లేఖనం– అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: **"ఎవరైతే అల్లాహ్ కొరకు ప్రేమిస్తారో మరియు అల్లాహ్ కొరకు ద్వేషిస్తారో, అల్లాహ్ కొరకే ఇస్తారో మరియు అల్లాహ్ కొరకే ఆపుతారో, వారు తమ విశ్వాసాన్ని పరిపూర్ణం చేసుకున్నవారవుతారు".** (అబూ దావూద్)

జ్ఞాన సముపార్జన ధనార్జన ధ్యేయంగా ఉండకూడదు

అల్లాహ్ యొక్క సంతోషం కొరకు ఎవరైనా జ్ఞానాన్ని సముపార్జించాలి, అలా కాకుండా దానిని ప్రాపంచిక ప్రయోజనం కొరకే సంపాదించినట్లయితే, పునరుత్థాన దినమున స్వర్గం యొక్క సువాసనను కూడా వారు ఆఘ్రానించ లేరు. (ఇబ్నె మాజా)

దైవప్రవక్త (స) ఎక్కువ బాధలు అనుభవించారు

ఆయిషా (ర) చెప్పారు: **"రసూలుల్లాహ్ (స) అనుభవించిన బాధలకంటే ఎక్కువ బాధలు అనుభవించిన వ్యక్తిని నేనెవరినీ చూడలేదు."** (ముస్లిం)

telgo fbrvry.indd 14 4/8/12 12:46 PM

వృద్ధుల పట్ల వ్యవహరించే విధానం

ముస్లిములు తల్లిదండ్రుల హక్కులను ఒక బాధ్యతగా నిర్వహిస్తారు. వారిపై దయ, కరుణ చూపటమేకాక వారి విధేయత ధార్మిక కర్తవ్యంగా భావిస్తారు. వారిని ఆదరించడం, వారి బాగోగులు చూచుకోవడం అల్లాహ్ విధించిన ఆరాధనలోని ఒక భాగం.

ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించారు: " మీ ప్రభువు ఇలా నిర్ణయించాడు, మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి, ఒకవేళ వారిలో ఒకరుగాని ఇద్దరుగాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా 'ఛీ' అని కూడా అనకండి."

ఒక వేళ మీ బాధ్యత ఒక వృద్ధురాలిని చూడటమైతే ప్రతి ఫలాన్ని దేవుని నుండి ఆశించాలి. ఆమెను మీ సొంత తల్లిలా చూసుకోవాలి. ఆవిడకు మీ ప్రత్యేక శ్రద్ధ చాలా అవసరం. కాబట్టి ఆమెతో వ్యవహరించునపుడు ఆప్యాయత మరియు నిగ్రహం అవసరం. ఆమె ఎంత కటువుగా మరియు కోపంగా ప్రవర్తించినా మీరు మాత్రం సహనమూర్తులై ఉండాలి. వాళ్ళపై నసగడం కానీ కస్సుబుస్సుమనడం కానీ చేయకూడదు. వారితో ఎలా ప్రవర్తించాలో కొన్ని సలహాలు క్రింద ఇవ్వబడుతున్నాయి.

ఒకవేళ ఆమెకు 'మసాజ్' చేయవలసి ఉన్నచో లేక శరీరము శుభ్ర పరచవలసి ఉన్నచో వారికి మృదువుగా మసాజ్ చేయాలి కారణం వారి ఎముకలు (ఉడిగిపోయి) చాలా సున్నితంగా ఉంటాయి. కనుక. ఎట్టి పరిస్థితులలోనూ వారి గుప్తాంగాలను కనపడనివ్వకూడదు.

పిల్లలు దగ్గర లేని సమయంలో విసుక్కోకుండా ఆమె మాటలు చిరునవ్వుతో వినాలి.

ఎన్నిసార్లు ఆమె మిమ్మల్ని ఇంటర్‌కామ్ ఉపయోగించి పిలిచినా విసుక్కోకూడదు, మీరు తీసుకునే వేతనము వారి సేవలకే. ఆ సేవను పూర్తి అంకిత భావంతో మరియు సహృదయంతో చేసినట్లయితే అల్లాహ్ మీకు అపారమైన మేళ్ళను ప్రసాదిస్తాడు. ఫోన్ మ్రోగుతూ ఉన్నా వినీ వినట్లు నటించకూడదు. ఎందుకంటే ఆవిడ ఏదైనా అత్యవసర పరిస్థితిలో లేక ఏదైనా శారీరక అవస్థలో లేక కాలకృత్యాలు తీర్చుకొనవలసి ఉండవచ్చు, లేక ఆమెకు ఔషధము కావలసి ఉండవచ్చు. లేక మీ ద్వారా తన అవస్థను తన పిల్లలకు చెప్పాలనుకుని ఉండ వచ్చు.

అల్లాహ్ మిమ్మల్ని చూస్తున్నాడు మీరు చేసే ప్రతి చర్యను ఆయన గమనిస్తున్నాడని, మరి ప్రళయదినాన మీరు ప్రశ్నింపబడతారు అనే భావంతో పని చేయాలి.

సమర్పణ - అనుసరణ

(10వ పేజీ మిగతా భాగం)

"ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్త(స)కు విధేయత కనబరుస్తారో వారే అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్య సంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తను లతోనూ ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు." (అన్ నిసా:69)

మరో చోట వారి గొప్ప స్థానం గురించి ఇలా చెప్పటం జరిగింది: అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స)కు విధేయత చూపేవారికి అల్లాహ్, క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో ప్రవేశం కల్పిస్తాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. గొప్ప విజయం అంటే ఇదే".

(అన్‌నిసా: 13)

ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స)ను అవిధేయత చూపిస్తారో వారు ఇహలోకంలోనే శిక్షకు గురి అవు తారు. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

"వినండి! ఎవరు ప్రవక్త ఆజ్ఞను ఎదిరిస్తు న్నారో వారు, తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చి పడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకరమైన శిక్ష చుట్టుముడుతుందేమోనని భయపడాలి".

(అన్‌నిసా: 63)

'ఘోరవిపత్తు' అంటే హృదయాల వక్రత అని అర్థం. ఈ వక్రతే మనిషిని విశ్వాస భాగ్యానికి నోచుకోకుండా చేస్తుంది. దైవ ప్రవక్త(స) ఆజ్ఞల పట్ల నిర్లక్ష్య ధోరణి, వ్యతిరేకత మూలంగా హృదయాలలో ఈ రకమైన 'వక్రత' జనిస్తుంది. ఎవరయితే ఈ రోగానికి లోనై విశ్వసించటానికి నిరాక రిస్తారో వారు శాశ్వితమైన నరకయాతన ను కొని తెచ్చుకున్నవారవుతారు. అందుకే అనుదినం, అనుక్షణం దైవప్రవక్త(స) విధా నాన్ని, సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుకంటే దైవప్రవక్త(స) విధానానికి అనుగుణంగా ఉండే సత్కర్మలే దైవ సన్నిధిలో స్వీకారయోగ్యం అవుతాయి. మిగిలినవన్నీ త్రోసిపుచ్చ బడతాయి. మహ నీయ ముహమ్మద్(స) వారు స్వయంగా ఇలా ప్రవచించారు: "ఎవరయినా మా విధానంతో సంబంధం లేకుండా ఏదన్నా సదాచరణ చేస్తే అది త్రోసిపుచ్చబడు తుంది".

(బుఖారీ,ముస్లిం)

ఇదేవిధంగా ప్రళయదినాన కూడా భయంకరమైన శిక్ష ఉంది. "ఎవడు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స) యెడల అవిధేయుడై, ఆయన నిర్ధారించిన హద్దులను మీరిపోతాడో వాడ్ని ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. వాడందులో ఎల్లకాలం పడి ఉంటాడు. అవమానకరమైన శిక్ష అలాంటి వారి కోసమే ఉంది. (అన్‌నిసా: 14)

అల్లాహ్ మనందరికి అల్లాహ్ ఆయన ప్రవక్త(స)కు విధేయత చూపించి జీవించే సద్బుద్ధిని ప్రసాదించుగాక ! ఆమీన్.

telgo fbrvry.indd 15 4/8/12 12:46 PM

ప్రవక్త యూనుస్ (అలైహిస్సలాం) చేప కడుపులో సజీవంగా మిగిలిన మనిషి

(800-750) క్రీ.పూ.)



నైనవాహ్ పట్టణ ప్రజలు విగ్రహారాధకులు. వారి జీవన విధానం సిగ్గు-లజ్జ లేకుండా ఉండేవి. వారి వద్దకు ప్రవక్త యూనుస్(అ) ను అల్లాహ్ పంపించాడు. వారిని సంస్కరించడానికి, అల్లాహ్‌ను ఆరాధించేలా వారిని తీర్చిదిద్దడానికి ప్రవక్త యూనుస్(అ)వచ్చారు. తమఆరాధనా విధానంలో యూనుస్ జోక్యం వారికి నచ్చలేదు. "మా తాతముత్తాతలు ఈ దేవుళ్ళనే ఆరాధించారు. మేము వీటిని చాలా కాలంగా ఆరాధిస్తున్నాము. మాకు ఎలాంటి హాని కలుగలేదు" అని వారు ఆయన మాటలను తిరస్కరించారు.

విగ్రహారాధన ఎంత అవివేకమైనదో, అల్లాహ్ ఆరాధనలోని ఔచిత్యమెంత గొప్పదో ఆయన వారికి నచ్చజెప్పడానికి చాలా విధాలుగా ప్రయత్నించారు. కాని వారు ఆయన మాటలు వినలేదు. తమ విధానాలు మార్చుకోనట్లయితే అల్లాహ్ శిక్ష విరుచుకుపడుతుందని ఆయన వారిని హెచ్చరించారు. అయినా వారు లక్ష్య పెట్టలేదు. తాము ఏ శిక్షకూ భయపడమని అన్నారు. ఆ శిక్ష ఏంటో రానీ చూద్దాం అన్నారు. నిరాశకు గురయిన యూనుస్(అ) వారితో, "అలా అయితే నేను మిమ్మల్ని మీ దురదృష్టానికి వదలి వేస్తున్నాను" అన్నారు. ఆ తర్వాత ఆయన అల్లాహ్ శిక్ష ఇక ఆ పట్టణాన్ని చుట్టుకుంటుందని భయపడి ఆ పట్టణాన్ని వదలి వెళ్ళిపోయారు.

ఆయన పట్టణం వదలి వెళ్ళిన వెంటనే అక్కడి ఆకాశం ఎర్రగా మంటలా మారిపోయింది. ఈ దృశ్యం చూసి ప్రజలు భయపడ్డారు. ఆద్, సమూద్, నూహ్ జాతి ప్రజల వినాశం గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు కూడా అలాంటి గతి పట్టనుందా! అన్న ఆలోచన వారిలో నెమ్మదిగా ధార్మిక విశ్వాసాన్ని సృజించింది. వారంతా ఒక కొండపై గుమిగూడారు. అల్లాహ్ కారుణ్యం కోసం, ఆయన క్షమాభిక్ష కోసం ప్రార్థించడం ప్రారంభించారు. వారి మొరలతో కొండలు ప్రతిధ్వనించాయి. నిజాయితీతో కూడిన పశ్చాత్తాపం వాతావరణమంతా అలముకుంది. అల్లాహ్ వారిపై తన ఆగ్రహాన్ని తొలగించి వారిని మరలా అనుగ్రహించాడు. భయంకరమైన తుఫాను శిక్ష తప్పుకోగానే వారు యూనుస్ ప్రవక్తను మళ్ళీ రావలసిందిగా కోరారు. ఆయన వచ్చి తమకు సరియైన మార్గం చూపించాలని కోరారు.

పడవ ప్రయాణం

ఈలోగా యూనుస్ ప్రవక్త(అ) ఒక పడవలో ప్రయాణమయ్యారు. ఆయనతో పాటు కొంత మంది ప్రయాణీకులు ఉన్నారు. సముద్రంలో ప్రయాణమైన తర్వాత తీవ్రమైన తుఫాను గాలికి పడవ చిగురుటాకులా వణికి పోసాగింది. పర్వతాల వంటి అలల తాకిడికి పడవ తలక్రిందులైపోతోంది. పడవలో చాలా సామాను ఉంది. ప్రయాణీకులు తమ సామాన్లను పడవ నుంచి బయటకు విసిరివేసారు. అయినా పడవలో బరువు చాలా ఎక్కువ ఉంది. ఇంకా బరువు తగ్గించకపోతే పడవకు ప్రమాదం. కాబట్టి కనీసం ఒక వ్యక్తిని సముద్రంలోకి విసిరేస్తే బరువు తగ్గుతుందని మిగిలిన వాళ్ళు భ్రతుకుతారని అనుకున్నారు. అందరూ చీటీలు వేశారు. ఈ లాటరీలో యూనుస్ ప్రవక్త పేరు వచ్చింది.

యూనుస్ ప్రవక్త గురించి వారికి తెలుసు. చాలా మంచివారు. గౌరవనీయుడు. అటువంటి మనిషిని సముద్రంలో పడిలేయడానికి వాళ్ళు ఇష్టపడలేదు. అందువల్ల వాళ్ళు మళ్ళీ లాటరీ వేశారు. రెండవసారి కూడా యూనుస్ ప్రవక్త పేరే వచ్చింది. చివరిసారిగా చూద్దామని మూడవసారి వేశారు. అప్పుడు కూడా యూనుస్ ప్రవక్త పేరే వచ్చింది. ఇందులో అల్లాహ్ అభీష్టం ఉందని యూనుస్ ప్రవక్త గుర్తించారు. ఆయన అల్లాహ్ అనుమతి లేనిదే తన పనిని మధ్యలో వదలి వేశారు. ఒక ప్రవక్తగా ఆయన తీవ్రమైన తప్పిదానికి పాల్పడ్డారు.

ప్రయాణీకులు తనను సముద్రంలో వదిలేయక ముందే ఆయన లేచి అల్లాహ్ పేరు స్మరిస్తూ సముద్రంలోకి దూకారు. భారీ అలల్లో ఆయన కలసిపోయారు.

చేప కడుపులో

యూనుస్ (అ) కళ్ళు తెరిచేసరికి తాను తడి తడిగా మెత్తగా ఉన్న ఒక నేలపై ఉన్నట్లు భావించారు. తన చుట్టూ ఉన్న ప్రదేశం అంతా మూసివేయబడిన ఒక గుహలా ఉంది. అంతా చాలా చీకటిగా ఉంది. కాని చాలా మృదువుగా,మెత్తగా ఉంది. ఆయనకు కుదుపులు తగులుతున్నాయి. అలల్లో పడవకు తగిలే కుదుపుల వంటివి. తాను ఒక పెద్ద చేప కడుపులో ఉన్నట్లు ఆయన గుర్తించారు. తుఫాను సముద్రంలో ఆయన్ను కాపాడడానికి గాను అల్లాహ్ ఆయన్ను ఒక చేప మింగేసేలా చేశాడు. ఆయన వెంటనే అల్లాహ్‌ను తలచుకుని తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.

"అల్లాహ్ తప్ప వేరే దేవుడు ఎవరూ లేరు. ఔన్నత్యం ఆయనదే. నిస్సందే హంగా నేను తప్పు చేశాను" అన్నారు.

అనంత కరుణామయుడు, అపారంగా క్షమించేవాడయిన అల్లాహ్ ఈ ప్రార్థనను ఆలకించాడు. ఆ వెంటనే తాను బలవంతంగా బయటకు తోయబడిన అనుభూతి యూనుస్(అ)కు కలిగింది. ధడాలున ఆయన మెత్తని నేలపై వచ్చిపడ్డారు. ఆయన్ను బయటకు కక్కేసేలా అల్లాహ్ ఆచేపకు ఆ జ్ఞాపించాడు. యూనుస్ (అ) వెంటనే అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించారు.

ఆయన ఒక నిర్జన ప్రదేశంలో ఉన్నారు. బలహీనంగా, ఒంటరిగా మిగిలి పోయారు. ఆయన పెద్ద పెద్ద ఆకులున్న ఒక పొదలో పడి ఉన్నారు. ఎండ వేడిమి నుంచి ఆ ఆకులు రక్షణ కల్పిస్తున్నాయి. అక్కడ చాలా సొరకాయలు ఉన్నాయి. వాటితో ఆయన తన ఆకలిని తీర్చుకున్నారు. నెమ్మదిగా ఆయన శక్తిని పుంజుకున్నారు. తన స్వస్థలం నైనవాహ్‌కు ప్రయాణమయ్యారు. అక్కడ ప్రజల్లో వచ్చిన మార్పును చూసి చాలా ఆనందించారు. ప్రజలంతా ఆయన్ను చాలా ఆదరంగా స్వాగతించారు. తామంతా నిజమైన దేవుణ్ణి విశ్వసించడం ప్రారంభించామని ఆయనకు తెలిపారు. వారంతా కలసి దేవునికి కృతజ్ఞతా సూచకంగా ప్రార్థనలు చేశారు.

(చదవండి దివ్యఖుర్‌ఆన్:6:86-57, 21:87-88 37:139-158)

Quran kathamaalika

telgo fbrvry.indd 16 4/8/12 12:46 PM

టి.ఎమ్.ఎ ఆధ్వర్యంలో విహార యాత్ర

తెలుగు మస్లిం అసోసియేషన్ ఆధ్వర్యంలో మస్జిదుల్ కబీర్ మరియు ఐపిసి సహకారంతో 24-2-2012 శుక్రవారం కువైట్ ఎడారి ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ఖీమాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో 500 మంది హాజరయ్యారు. ఆటల పోటీలు, కువైట్ స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించి సాంస్కృతిక పోటీలు పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో ఆహ్లాదకరంగా జరిగాయి. కువైట్ ఔఖాఫ్ ఆహ్వానంపై భారత దేశం నుంచి విచ్చేసిన ధర్మప్రబోధకులు శ్రీ ఫజ్లుర్రహ్మాన్ గారు జుమా ప్రసంగం మరియు నమాజు చదివించగా పోటీల కార్యక్రమం మరియు ఇతర పనుల బాధ్యతను వివిధ సోదరుల స్వీకరించారు.







పరస్పర సంబంధాల్ని మెరుగు పర్చుకోవడం ఎలా?

టిఎమ్ఎ ఆధ్వర్యంలో 24-03-2012 వ తేదీ శనివారం నాడు కువైట్‌లోని పెద్ద మస్జిద్‌లో **'పరస్పర సంబంధాల్ని మెరుగుపర్చుకోవడం ఎలా?'** అన్న అంశంపై ధార్మిక సభ నిర్వహించబడింది. కువైట్‌లో నివసించే ఆంధ్ర ముస్లిం కుటుంబాల్లో సంబంధాల ప్రాముఖ్యత అవగాహన కలుగజేయాలన్న ఉద్దేశ్యంతో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో సోదరులు అయ్యూబ్ ఖాన్ ఖుర్‌ఆన్ పారాయణం చేయగా, భారత దేశం నుంచి విచ్చేసిన పండితులు శ్రీ అక్బర్ అలీ రషాదీ గారు ఉర్దూలో సత్సంబంధాల ప్రాముఖ్యతను తెలియజేశారు. తెలుగులో పరస్పర సంబంధాల్లో మాట పోషించే పాత్ర గురించి పవర్ పాయింట్ రూపంలో **నెలవంక** ఎడిటర్ సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ వివరించారు. సాంతం ఆహ్లాదకరంగా జరిగిన ఈ కార్యక్రమానికి కన్వినర్‌గా సోదరులు షేక్ న్యామతుల్లాహ్ వ్యవహరించగా, చివర్లో సోదరులు అన్వర్ గారు అందరికి కృతజ్ఞతలు తెలుయజేశారు.









telgo fbrvry.indd 17 4/8/12 12:48 PM



శాంతి బాట టీమ్

అబూహురైరా (ర) ఉల్లేఖించారు: 'ఒక వ్యక్తి ప్రవక్త (స) సమ్ముఖంలో హాజరై అడిగాడు. 'దైవప్రవక్తా! నా అనురాగానికి ఎక్కువ అర్హులు ఎవరు? 'నీ తల్లి' అని పలికారు. అతను మళ్ళీ అడిగాడు 'ఆ తరువాత ఎవరు?' అని

'నీ తల్లి'

తర్వాత ఇంకెవరు?

'నీ తల్లి'

ఆ తర్వాత?

'నీ తండ్రి' అని ఆయన (స) అన్నారు.

అంటే సంతానం చూపే అనురాగంలో 4 వంతులలో 3 వంతులు అమ్మకే (స్త్రీకే).

(సహీహ్ ముస్లిమ్,నెం.6500 పుస్తకం 45 అధ్యా. 1)

ఆడపిల్ల పుట్టడాన్ని అవమానకరంగా భావించి, అల్లుడి ముందు తలదించుకోలేక తమ ఆడపిల్లలను సజీవంగా పూడ్చి పెట్టే అరబ్బులను సంస్కరించి, ఆడపిల్లలను అపురూపంగా పెంచే స్థాయికి తీసుకెళ్ళిన మేటి సంస్కర్త ముహమ్మద్ (స) .

ఈ సంస్కరణ కూడా 23 సంవత్సరాల కాలంలోనే జరిగింది. తరతరాల నుండి అమలు లోనున్న చెడును సమూలంగా తుడిచేసింది ఇస్లాం. ఇలాంటి అసాధ్యాలెన్నింటినో అల్లాహ్ దయచే సాధించిన ఏకైక వ్యక్తి ముహమ్మద్ (స). ఇంత గొప్ప సంస్కరణను అతి తక్కువ కాలంలో గావించిన సంస్కర్త ప్రపంచంలో మరెవరైనా ఉన్నారా?



స్త్రీని పురుష బంధాలనుండి పైకి లేవ నెత్తింది ఇస్లాంలోని ప్రజాస్వామిక తత్వమే. సర్ ఛార్లెస్ ఎడ్వర్డ్ ఆర్చిబాల్డ్ హెమిల్టన్ ఇలా అంటున్నారు: **"మనిషిలో సహజంగానే అంతర్లీనమయి ఉన్న పాపరాహిత్యాన్ని గురించి ఇస్లాం ప్రబోధిస్తుంది. దాని బోధనల ప్రకారం స్త్రీ పురుషులిరువురూ ఒకే మూలం నుంచి ఆవిర్భవించారు. ఇద్దరిలో ఉన్నది ఒకే ఆత్మ. ఇద్దరూ బుద్ధి జ్ఞానాలు, ఆధ్యాత్మికతా నైతికతలకు సంబంధించిన సమానమయిన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారు".**

ఇస్లాం ఆవిర్భవించి, బలహీనులయిన స్త్రీ జాతిని రక్షించేందుకు ముందుకు వచ్చింది. స్త్రీలకు తమ తల్లిదండ్రుల ఆస్తిలో వాటా పొందే హక్కు నిచ్చింది. కాని ఆ తరువాత 12 శతాబ్దాలకు, అంటే 1881లో ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా చెప్పుకునే ఇంగ్లాండు, ఇస్లాం ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థనే అరువు తెచ్చుకోవడం జరిగింది.

కాని శతాబ్దాలకు పూర్వం ఇస్లాం ప్రవక్త చేసిన ప్రకటనలివి: **"స్త్రీలు పురుషులకు రెండు సగ భాగాల్లాంటి వారు, స్త్రీల హక్కులు పవిత్రమైనవి. స్త్రీలు తమకు ప్రాప్తమయిన హక్కుల ప్రకారం జీవించేలా చూడండి."**

వీరేశలింగం, రాజారామమోహన్‌రాయ్ మొదలైన సంఘ సంస్కర్తల గురించి మాత్రమే తెలిసిన భారతీయులకు 1400 సంవత్సరాల క్రితమే సమాజ సంస్కరణ ప్రారంభించి, దానిని అత్యంత విజయవంతంగా పూర్తి గావించిన ఈ మహనీయుడు గురించి కొద్దిగా కూడా తెలియదు. వారికి తెలిసేలా మన తోటి ముస్లిం సోదరులు కూడా అంతగా ప్రయత్నించలేదనేది కూడా వాస్తవమే.

ఆచరణ

మంచిని గురించి ప్రపంచంలోని అన్ని మతాలు బోధిస్తున్నాయి. కాని 'మంచి'ని ఎటువంటి సందేహానికి తావు లేకుండా అత్యంత స్పష్టంగా వివరించి తన స్వీయ ఆచరణ ద్వారానే ముహమ్మద్ (స) వారు బోధించారు.


ఆయిషా (ర) వారి దగ్గరికి ఒకసారి కొందరు వ్యక్తులు వచ్చి 'ఉమ్ముల్ మోమినీన్! (విశ్వాసుల మాతా!) దైవప్రవక్త (స) నడవడికల్ని వివరించండి' అని అడుగగా, "ఏమిటి? మీరు ఖుర్'ఆన్ చదవలేదా? ఆయన (స) నడవడిక పూర్తిగా ఖుర్'ఆనే కదా!" అని ఆమె బదులిచ్చారు. ఆరాధనా విధానం ఎటువంటిది అని వారు తిరిగి ప్రశ్నిస్తే, "సూరయె ముజమ్మిల్ చదువ లేదా?" అని అన్నారు. అంటే ఆయన ఆరాధనా విధానం ఖుర్'ఆన్‌లో సూరయే ముజమ్మిల్‌లో చెప్పిన విధంగా ఉంటుందని.

కాబట్టి ఆ మహనీయుని (స) జీవితాన్ని ఎవరైనా అనుసరిస్తే, వారు ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అనుసరించినట్లే.

బానిసత్వ నిర్మూలన మరియు సమానత్వం

అనాదిగా బానిసత్వం ప్రపంచంలో ఉంటూనే వచ్చింది. ఈ బానిసత్వాన్ని రూపు మాపాలి. ఆ విషయంలో తొలి ప్రయత్నంగా బానిస బాలుడిగా తన వశమైన జైద్ బిన్ హారిస్ (ర)కి స్వేచ్ఛ నివ్వడమే కాకుండా, ప్రవక్త (స) వారు ఆ అబ్బాయిని తన దత్తపుత్రునిగా స్వీకరించి అతని హూదాను పెంచారు.

telgo fbrvry.indd 18 4/8/12 12:50 PM



బానిసత్వాన్ని రూపుమాపేందుకు, అనాధలకు రక్షణ కల్పించేందుకు తొలి రోజుల్లోనే ముహమ్మద్ (స)వారు పునాది వేశారు. తాను చేసుకున్న వివాహాల ద్వారా మరియు బోధనల ద్వారా, బానిస వ్యవస్థను సమూలంగా పెకిలించడానికి పూనుకున్నారు. ఆయన చలువ వలనే ఈనాడు ప్రపంచంలో బానిసత్వం లేకుండా పోయింది.

"మానవులారా! మీ ప్రభువుకు భయ పడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణినుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు".

(ఖుర్ఆన్4:1)

ముహమ్మద్ (స) వారి చివరి హజ్ ప్రసంగంలో ఇలా తెలియజేశారు:

'..ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే. తండ్రి ఒక్కడే. మీరంతా ఆదం (అలైహి స్సలాం) సంతానం. ఆదం (అ) మట్టితో సృజించబడ్డారు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో అందరికంటే ఉత్తముడు..' ముఖ్యంగా ఆయన జాతి, రంగు, తెగ వర్ణ, వర్గ వివక్షలను, నిమ్నోన్నత భేద భావాలను నిరసిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వాలను గురించి ఈ ప్రసంగంలో నొక్కి చెప్పారు.

ఆచరణయోగ్యమైన సమసమానత్వాన్ని స్పష్టంగా బోధించిన దైవధర్మమే 'ఇస్లాం' సమసమానత్వం లేనిదే సుందర సమాజం స్థాపించబడలేదు. ఈ సమానత్వ భావన మరియు ఆచరణే, ఇస్లామ్‌ని ప్రపంచ మంతా వ్యాపించేలా చేసింది.

ఈ సందర్భంగా గానకోకిల శ్రీమతి 'సరోజినినాయుడు' గారి అభిప్రాయాన్ని విందాం.

"ప్రజాస్వామిక వ్యవస్థనుఆదేశించడమేగాక ఆచరించి చూపిన తొలిధర్మం ఇస్లామే. మస్జిద్‌లో అజాన్ (నమాజ్ కై పిలుపు) పల కగానే దాసులందరూ వచ్చి చేరున ప్పుడు, రైతూ రాజు ప్రక్కప్రక్కనే దైవం సమక్షంలో మోకరిల్లి 'అల్లాహ్ గొప్ప వాడు' అని ప్రక టించినపుడు ఇస్లాంలోని ప్రజా స్వామిక విధానం ప్రజల్లో రోజుకు 5 సార్లు మూర్తీ భవించి దర్శనమిస్తుంది. ఇస్లాం ప్రబో ధించే ఈ అబేధ్యమైన ఐక్యతను చూసి అనేకమార్లు ప్రభావితురాలిన య్యాను."

బానిసగా ఉండే నీగ్రో అయిన హజ్రత్ బిలాల్(ర)ను అతని యజమాని మండు టెండలో నేలపై పడుకోబెట్టి, ఛాతీపై పెద్ద బండరాయి పెట్టి హింసించినా, అతనికి తాళ్ళు కట్టి, ఆ తాళ్ళను పిల్లలకిచ్చి వీధుల్లో ఊడ్పించినా సరే, ఆయన 'అహద్, అహద్' అంటూ 'అల్లాహ్ ఒక్కడే' ఆరాధ్యుడనే విశ్వాసాన్ని వదల లేదు. అతనికి పెట్టే హింసలను చూడలేక, ముహమ్మద్ (స) వారి ఆదేశంతో అబూబకర్ సిద్దీఖ్ (ర), బిలాల్ (ర)వారిని అతని యజమాని నుండి కొని, అతనికి స్వేచ్ఛనిచ్చేసారు. మక్కా విజయం తరువాత అరబ్బులు పవిత్రంగా భావించే కాబా పైకి ఎక్కి నిలుచుని సలాత్ (నమాజ్) కోసం ఈ బిలాల్ (ర) అజాన్ ఇచ్చారు.

ప్రపంచంలోని ప్రతీ మస్‌జిద్‌లో రోజుకు ఐదుసార్లు 'అజాన్' ఇవ్వబడుతుంది. గత 1432 సంవత్సరాల నుండి అజాన్ ఇవ్వ బడుతూనే ఉంది. అయితే ఈ అజాన్‌ను మొట్టమొదట ఇచ్చిన వ్యక్తి బిలాల్(ర). ఈయనకి ముహమ్మద్ (స) వారంటే అపారమైన ప్రేమాభిమానాలుండేవి.

జైద్ బిన్ హారిస్ (ర)ను ముహమ్మద్ (స) వారు బానిసత్వం నుండి విముక్తుడిని చేసి, అతనిని దత్తపుత్రునిగా చేసుకుని, ఉన్నత వంశానికి చెందిన తన బంధువుల కుమార్తె తో వివాహం జరిపించారు.

ఈజిప్ట రాజుచే తనకు కానుకగా పంప బడిన బానిస (ఆఫ్రికన్) మహిళకు స్వేచ్ఛ ను ఇచ్చి, ఆమెను వివాహం చేసు కుని ఆమె యొక్క హూదాను ముస్లిముల మాతృమూర్తి స్థాయికి పెంచిన మహా న్నత వ్యక్తి – ముహమ్మద్ (స).

ఎవరైనా, ఏదైనా పాపం తమ వలన జరిగిందని, పాప పరిహారం కోసం, ముహమ్మద్(స) వారిని అడిగినప్పుడు, ముందుగా బానిసలకు స్వేచ్ఛనివ్వమని చెప్పేవారు.

వివాహం చేసుకోవడానికి విగ్రహారాధకు రాలైన కులీన స్త్రీ కంటే, విశ్వాసి అయిన బానిస స్త్రీ ఎంతో మేలని చెబుతుంది ఖుర్ఆన్. ఒకవేళ ఎవరైనా ఒట్టు వేసు కొన్నాక (అంటే ప్రమాణం చేసుకున్నాక) దానిని భంగపరిస్తే, దానికి పరిహారం మరేమిటో కాదు ఒక బానిసకు స్వేచ్ఛ నివ్వడమే. బానిసలతో సోదరులవలె మెలగమని ఇస్లాం బోధిస్తుంది.

ఈ విధంగా అల్లాహ్ చూపిన మార్గం ద్వారా సామాజిక న్యాయాన్ని తన వారి లో వికసించేలా చేసి చూపిన మహా వ్యక్తి ముహమ్మద్ (స).

ప్రార్థనలు

రాత్రిలో అధికభాగం దైవారాధనలో గడిచేది. తరచుగా తన సృష్టికర్త అల్లాహ్ సమక్షంలో ముహమ్మద్(స) వారి యొక్క కళ్ళు ధారాపాతంగా కురిసేవి.తన బాధ్య తల్ని నిర్వర్తించేందుకు శక్తినివ్వమని ఆయన అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండే వారు. ప్రార్థించేటప్పుడు కొన్ని ఉల్లేఖనాల ప్రకారం, ఆయన కంఠం దుఖం వల్ల పూడుకు పొయ్యేది. పొయ్యి మీద కుండ కుతకుతలాడు తుంటే వచ్చే శబ్దంలాగ వినిపించేది.

హజ్రత్ ముగైరా బిన్ షాబా(ర) ఉల్లేఖ నం: దైవప్రవక్త(స) (రాత్రివేళ సలాత్ కొరకు) నిలబడేవారు లేక ఆయన పాదాలు వాచిపోయే వరకూ నమాజ్ చేస్తుండేవారు. అనుచరులు ఈ విష యాన్ని ప్రస్తావిస్తూ మీరింతగా శ్రమ పడతారెందుకు? అని ఆయన(స)ను అడ గడం జరిగింది. దానికి దైవప్రవక్త(స) సమాధానమిస్తూ "(అల్లాహ్ నాకు చేసిన మేలుకుగాను) నేను కృతజ్ఞుడయిన దాసు డిగా తయారు కావద్దా?" అని అన్నారు.

(సహీహ్ బుఖారీ)

telgo fbrvry.indd 19 4/8/12 12:50 PM

కత్తి చార్వకుడు

(ఖైతాన్ ఖత 10లో ఓ తెలుగు మహిళ ఆత్మహత్యకు నిరసనగా....!)

కర్మ భూమిలో పూసిన ఓ పువ్వా

కర్మభూమిలో పూసిన ఓ పువ్వా
విరిసి విరియని ఓ చిరు నవ్వా
కన్నుల ఆశలు నీరయి కారగ
కట్నపు జ్వాలలో సమిధైపోయావా

పారాణింకా ఆరనే లేదు
తోరణాల కళ వాడనే లేదు
మంగళ నాదాలాగనె లేదు
బంధువులింట్లకు చేరనే లేదు
పెండ్లి పందిరి తీయనె లేదు
అప్పగింతలు అవ్వనె లేదు
గలగల పారే ఓ సెలయేరా
పెళ్ళి కూతురిగా ముస్తాబయ్యి
శ్మశానానికే కాపురమెళ్ళావా

"కర్మ"

మానవత్వమే మంట గలిసెనా
మమతల కర్థం ఆలేకపోయేనా
వేద ఘోష ఎగతాళి చేసెనా
ప్రమాణాలు పరిహాసమాడెనా
ప్రేమ బంధముగ కట్టిన తాళి
ఉరి తాడయ్యి కాటు వేసెనా
పున్నమి రువ్విన వెన్నెలనవ్వా
కారుమేఘాలు కమ్మేశాయా
చీకటి చితిలో శవానివయ్యావా

"కర్మ"

రాక్షస విలువలు రాజ్యమేలెడి
నరకప్రాయపు సంఘములోన
మనిషికి మనిషికి బంధాలన్నీ
మార్కెట్లోన సరుకులాయెనా
అడబడుచులే శత్రువలైరా
అత్త కన్నులే నిప్పులు చెరిగెనా
కళకళలాడిన ఓ నవ వధువా
శిశిరం నిన్ను కబళించిందా
మలమల మాడిన బొగ్గపోయావా

"కర్మ"

ఆడది కన్నా అడవిలో మాననుకై
విలువిచ్చే దేశంలోనా
ఆరడి పెట్టిన ఆడపడుచుకూ
అత్తారింట తప్పని స్థితియిది
బ్రతుకున నిప్పులు పోసిన అత్తకు
గర్భశోకము తప్పకున్నది
పిశాచ గణాల ఆనందానికి
మారణ హోమం జరుగుతున్నది
లేళ్ళను చంపే పులు సీమలో
కోకిల మేధం సాగుతున్నది
జీవన రాగం ఆర్తనాదమాయె

"కర్మ"

ఎవరోస్తారని ఎదురు చూపులు
ఏం చేస్తారని ఈ పడిగాపులు
విషం మింగినా తగులబెట్టినా
ఉరితాడుకు బిగదీసి చంపినా
ఏ డాక్టరు నీకై సాక్ష్యం రాడు
కోర్టులు నీకు రక్షణ రావు
చట్టాలన్నీ కోర్టులు అన్నీ
నేతి బీరలో నేయి చందమె
సామాన్యుల కవి ఎండమావులేనే

"కర్మ"

అక్కలారా ఓ చెల్లెల్లారా
వ్యవస్థ మలచిన అబలల్లారా
కాలే గుండెల కమురు వాసనకు
కన్నులు ఏరులు పారుతున్నవా
దారి పొడుగున శవాల గుట్టలు
గుండెన గాయం కెలుకుకున్నవా
క్రూరుల పీడన నెదిరించాలె
స్త్రీలుపురుషులు మన్నుషలందరూ
సమానమన్న సమాజముండాలె

కర్మభుమిలో పూసిన ఓ పువ్వా
కన్నుల మంకెన పువ్వులు పూయగ
నెత్తురు మంటల కేతనమవగ
సమరహోరులో ముందుండాలమ్మా
నువ్వుసమరహోరులో ముందుండాలమ్మా

నెలవంక ఉత్తరాలు

కాస్త్ని క్షణాలు ఆలోచించినా చాలు

ధన్యవాదాలు మిత్రమా...సుదూర ప్రాంతం నుండి తెలుగు సోదరుల కోసం అచ్చ తెలుగులో స్వచ్ఛమై ఆకృతితో **నెలవంక** మాస పత్రికను నడుపుతూ తెలుగు భాషపై అభిమానం చూపిస్తున్న మీలాంటి వారిని చూసి ఎంతో మంది తెలుగువారు మాతృభాష గురించి కొన్ని క్షణాలు ఆలోచించినా చాలు.

శ్రీధర్ నల్లమోతు - ఇండియా

బీజంలో భూజం

మాతృ భాషను ప్రేమించాలి మనం
మాతృ భాషను గౌరవించాలి మనం
మాతృ భాషలో మంచిని పంచాలి మనం
మాతృ భాషను సర్వవ్యాప్తం చేయాలి మనం
భాష అనేది రెండు అక్షరాలే అయినా
ఆ రెండు అక్షరాలలో విశ్వం ఒదిగి ఉంది
వింతగా అన్పించవచ్చు....ఎలా అని
సందేహం కలుగా వచ్చు....
బీజంలో భూజముండటం అంటే ఇదే!
అతి చిన్న విత్తనంలో మహా వృక్షం దాగి ఉండటం...**నెలవంక** కూడా తన స్థానంలో ఒక మహా సందేశాన్ని కలిగిన ఒక బీజమే. ఈ బీజం చిగురించి, శాఖోప శాఖలుగా విస్తరించాలని, మేలిమి మధుర ఫలాలను తెలుగు జనావళికి అందించాలని, విదేశాల్లో తెలుగు భాషకు తల మానికంగా వర్థిల్లాలని ప్రార్థిస్తూ!

షేక్ మస్తాన్ - ఇండియా

telgo fbrvry.indd 20 4/8/12 12:50 PM



ప్రజలారా!

చివరి హజ్జ్ సందర్భంగా దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: "ప్రజలారా! మీ అందరి ప్రభువు ఒక్కడే. మీరందరి తండ్రీ ఒక్కడే. మీరంతా ఆదం (అ) సంతానం. ఆదం (అ) మట్టితో సృజించబడ్డారు. మీలో ఎక్కువ భయభక్తులు గల వాడే అల్లాహ్ దృష్టిలో గౌరవనీయుడు. వినండి! అరబ్యేయుడికి అరబ్యేతరునిపైగాని, అరబ్యేతరునికి అరబ్యేయుడిపైగాని, నల్లవానికి తెల్లవానిపైగానీ, తెల్లవానికి నల్లవానిపై గాని ఎలాంటి ఆధిక్యత లేదు; దైవభీతితో తప్ప". (షర్హుత్తహావియహ్)



ఆత్మ స్తుతి వద్దు - ఆత్మ పరిశీలనే ముద్దు

స్వర్గమంటే ఇష్టపడని వారు ఎవరుంటారు చెప్పండి. వ్యక్తి తాను మంచోడైనా, చెడ్డోడైనా స్వర్గానికి వెళ్ళాలనుకుంటాడే తప్ప నరకం పాలు కాదలుచుకోడు. అయితే ఆ దిశగా మన ప్రయత్నం ఏపాటిది? దైవ దాసులైన ప్రజలందరి పట్ల మనలో సాత్విక ప్రేమ ఉందా? ఆర్థికంగా అద్భుత విజయాల్ని ఆవిష్కరించగలుగుతున్న మనం ఆధ్యాత్మికంగా అవే ప్రగతి ఫలాల్ని అందుకుంటున్నామా? పరివారాన్ని, పరిసరాల్ని గుర్తించినట్లుగా మనం మన నిజ దైవాన్ని గుర్తిస్తున్నామా? స్వర్గాన్ని నిరతం కాంక్షించే మనం, ఆ స్వర్గాన్ని మనకు అనుగ్రహించగలిగే శక్తి ఎవరికుందో ఎప్పుడైనా ఆలోచించామా? మనుషులంతా ఒకటే అయినప్పుడు వారి కోసం దైవం నిర్దేశించిన జీవన ధర్మం కూడా ఒకటే అయి ఉండాలి కదా! అలా లేదు అంటే కారణాలు ఏమిటి? మనిషి చేసిన సిద్ధాంతాల్ని, కల్పితాచారాల్ని అవలంబిస్తే స్వర్గప్రాప్తి లక్ష్యం సిద్ధిస్తుందా? ఆత్మస్తుతి మాని ఆత్మ పరిశీల చేసుకుందాం రండి!